PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 287 | విజయవాడ, బుధవారం 22 మే 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 22 May 2024 | Rs



కరువు సీమలో నకిలీ ప(క్ర)త్తి!

- నష్టపోతున్న రైతులు

2




ఫైనల్‌కు కోల్‌కతా

6

- హైదరాబాద్‌పై ఎనిమిది వికెట్ల తేడాతో కోల్‌కతా గెలుపు

సంఘ్ పరివార్‌లో మోడీపై మంటలు!

ఆర్‌ఎస్‌ఎస్ శ్రేణుల్లో పెరుగుతున్న వ్యతిరేకత



న్యూఢిల్లీ : 'ఒకప్పటి బిజెపికి, ఇప్పటి బిజెపికి చాలా తేడా ఉంది. అప్పట్లో మా సామర్థ్యం తక్కువగా ఉండేది. చాలా చిన్నగా ఉండేవాళ్లం. అందుకే ఆర్‌ఎస్‌ఎస్ అవసరం ఉండేది. మాకు ఉపయోగపడింది. ఇప్పుడు మేము కూడా పెరిగాము. సమర్థులుగా నిలిచాం. ఆర్‌ఎస్‌ఎస్ ఒక సాంస్కృతిక సంస్థ. మాది రాజకీయ సంస్థ. ఎవరి పనులు వారికుంటాయి కదా! బిజెపి ఇక స్వయంగా నడుస్తుంది.'

ఐదవ దశ పోలింగ్ ఒక రోజు ముందు బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా అన్న మాటలు ఇవి,

నరేంద్రమోడీ ప్రధాని అయిన తరువాత బిజెపి – ఆర్‌ఎస్‌ఎస్ మధ్య ఉన్న సంబంధాల్లో వచ్చిన మార్పునకు ఈ వ్యాఖ్యలు నిదర్శనమని పరిశీలకులు భావిస్తున్నారు. అదే సమయంలో ఆర్‌ఎస్‌ఎస్ అగ్రనాయకులతో మోడీ సత్సంబంధాలు కొనసాగిస్తున్నారు. అన్ని సందర్భాల్లోనూ వారి ఆమోదం, ఆశీస్సులతోనే ముందుకెళ్తున్నారు. తనను తాను సర్వశక్తిమంతుడిగా ప్రచారం చేసుకుంటున్న మోడీ, ఆయన ఇద్దరు అనుంగు మిత్రులు (అమిత్‌షా, నడ్డా) సంఘ్‌పరివార్ ప్రాభవాన్ని తగ్గించేందుకు ఒక పథకం ప్రకారం పనిచేస్తున్నారన్న అభిప్రాయం సంఘ్‌పరివారంలో కొంత కాలంగా వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో నడ్డా తాజాగా చేసిన వ్యాఖ్యలు ఆర్‌ఎస్‌ఎస్ శ్రేణుల్లో చర్చనీయాంశమయ్యా యి. ఆర్‌ఎస్‌ఎస్‌తో అవసరం తీరిపోయిందని, బిజెపిని ఇక నుండి తాము స్వయంగా నడుపుకుంటామన్నట్లుగా ఆయన చెప్పిన మాటలపై 'సంఘ్ పరివారం'లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నట్లు సమాచారం. దీని ప్రభావం ఐదవ విడత పోలింగ్ ప్రక్రియపై కూడా పడ్డట్లు వార్తలు వస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో బిజెపికి పట్టున్న అనేక నియోజకవర్గాల్లో నత్తనడకన పోలింగ్ జరగడం, అతి తక్కువగా పోలింగ్‌శాతం నమోదు కావడం దీనికి నిదర్శనమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మిగిలిన రెండు విడతల పోలింగ్‌లో కూడా ఇదే ధోరణి కొనసాగే అవకాశం ఉందని భావిస్తున్నారు. 'ది వైర్' తాజాగా ప్రచురించిన కథనంలో ఆర్‌ఎస్‌ఎస్–బిజెపిల మధ్య పెరిగిన దూరాన్ని, దానికి దారి తీసిన పరిణామాలను సోదాహరణంగా వివరించింది.

సంఘ్ పరివార్ × మోడీ పరివార్

సంఘ్‌పరివార్‌కు, మోడీ పరివార్ (మోడీ, అమిత్‌షా, నడ్డా తదితరులు)కు మధ్య కొంత కాలంగా ఆధిపత్య పోరు సాగుతున్నట్లు సమాచారం. గతంలో మాదిరే తమ కనుసన్నల్లో బిజెపి నడవాలన్న సంఘ్‌పరివార్ ఆదేశాలను మోడీ పరివార్ బేఖాతరు చేస్తోందని చెబుతున్నారు. హిందుత్వ అజెండాగా, ప్రజలను చీల్చి, మతోన్మాదాన్ని రెచ్చగొట్టి అధికారంలోకి రావడానికి ఆర్‌ఎస్‌ఎస్ కొన్ని దశాబ్దాలుగా ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. అయితే, రెండు సార్లు వరుసగా బిజెపి అధికారంలోకి రావడానికి మోడీ మానియానే కారణమని ఆయన పరివారం ప్రచారం చేసుకుంటోంది. దీనిపైనే సంఘ్‌పరివారంలో అభ్యంతరాలు వ్యక్తమవుతుండగా, తాజా ఎన్నికల్లో ఏకంగా మోడీ గ్యారంటీ పేరుతో ప్రచార బరిలోకి దిగడం వారిని మరింత ఆగ్రహానికి గురిచేస్తోంది. సంఘ్‌పరివార్ నుండి దీనిపై వ్యక్తమైన అభ్యంతరాలను సైతం మోడీ పరివారం పట్టించుకోలేదని, ఎన్నికల ప్రచార తీరుకు సంబంధించి సంఘ్‌పరివార్ చేసిన సూచనలను సైతం ఖాతరు చేయలేదని సమాచారం.

అద్వానితో మొదలు పెట్టి...!

మోడీ అధికార బాధ్యతలు చేపట్టిన తరువాత సీనియర్ నాయకులు ఒక్కొక్కరిని పక్కన బెట్టిన విషయం తెలిసిందే. అద్వానితో ప్రారంభమైన ఈ పరంపర ఇంకా కొనసాగుతోంది. ఎన్నికల వేళ అద్వానికి భారతరత్నను ప్రకటించినప్పటికీ, మిగతా 2లో

సిట్ నివేదికను బహిర్గత పర్చాలి

- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో చోటుచేసుకున్న హింసాత్మక సంఘటనలపై దర్యాప్తునకు నియమించిన సిట్ బృందం సమర్పించిన నివేదికను బహిర్గతం చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటి డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీసుల దర్యాప్తులోనే అనేక లోపాలున్నట్లు సిట్ నిర్ధారించిన నేపథ్యంలో ఆ నివేదికలోని అన్ని వివరాలనూ వెల్లడించాల్సిన అవసరం వుందని పేర్కొన్నారు. అల్లర్లు, హింసకు సంబంధించిన కేసులలో దర్యాప్తులోని లోపాలను సరిచేసేలా ఎఫ్‌ఐఆర్‌లో మరికొన్ని సెక్షన్లు చేర్చాలని సిట్ ప్రతిపాదించినట్లు వార్తలొచ్చాయని, ఏయే సంఘటనల్లో ఏయే సెక్షన్లు చేర్చవచ్చో కూడా నిర్దిష్టంగా వివరించినట్లు సమాచారం వుందని తెలిపారు. దర్యాప్తులో భాగంగా ఆయా ప్రాంతాల్లో సంఘటన ఎలా జరిగింది, ఆ సమయంలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులెవరు, సంఘటన జరగకుండా ముందస్తుగా ఎందుకు చర్యలు తీసుకోలేకపోయారు, అల్లర్లు జరగకుండా తీసుకున్న చర్యలేమిటి, ఘటనలకు సంబంధించి ఎన్ని ఎఫ్‌ఐఆర్‌లు చేశారు, ఏయే సెక్షన్లు వేశారు, కేసుల్లో అసలైన నిందితులను పెట్టారా, లేక రాజకీయ ఒత్తిళ్లకు లొంగి వారిచ్చిన పేర్లను కేసుల్లో ఇరికించారా లాంటి విషయాలను స్థానికులు, పోలీసుల నుంచి వివరాలు రాబట్టిన సిట్ ఆ అంశాలను కూడా నివేదికలో పొందుపరిచిందని మీడియాలో వార్తలు వచ్చాయన్నారు. పల్నాడు, అనంతపురం, తిరుపతి జిల్లాల్లో ఈ సంఘటనలకు సంబంధించి 33 కేసుల్లో మొత్తం 1,370 మంది నిందితులలో ఇప్పటి వరకు 124 మందిని మాత్రమే అరెస్ట్ చేయగా, మరో 94 మందికి 41(ఎ) కింద నోటీసులు జారీ చేశారన్నారు. మిగిలిన 1152 మిగతా 2లో



అనకాపల్లి జిల్లా మునగపాక మండలం నాగులాపల్లిలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లో సీజ్ చేసిన వాహనాలు

పొంచి వున్న ముప్పు!

- మోహరిస్తున్న రెండు పార్టీల కార్యకర్తలు
- రాష్ట్ర వ్యాప్తంగా కార్డన్ సెర్చ్
- సిఎస్‌తో భేటీ అయిన డిజిపి

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

ఘర్షణలు జరిగిన ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పోలీసు బలగాలు దిగినప్పటికీ పరిస్థితి ఇంకా పూర్తిగా అదుపులోకి రాలేదు. రెండు పార్టీల కార్యకర్తలు పరస్పర మోహరింపు కొనసాగుతూనేఉంది. దీంతో అనేక ప్రాంతాల్లో నివురుగప్పిన నిప్పులా పరిస్థితి మారింది. రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం నాడు పోలీస్‌శాఖ నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లోనూ ఇదే విషయం తేటతెల్లమైంది. 301 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించిన పోలీసులు అక్కడ పూర్తి స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎలాంటి పత్రాలు లేని 1,104 వాహనాలను జప్తు చేశారు. ఈ వాహనాలు ఎవరివన్న విషయమై పోలీసులు ఆరా తీస్తున్నారు. 482 లీటర్ల నాటుసారా, 33.32 లీటర్ల మద్యం, 436 లీటర్ల నాన్ డ్యూటీ లిక్కర్ స్వాధీనం చేసుకున్నారు. ఇంకా అనేక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మద్యం నిల్వలు ఉన్నట్లు సమాచారం అందింది. మరోవైపు ఎన్నికల రోజు, తదనంతరం జరిగిన దాడులకు సంబంధించి 2,790 మందిని గుర్తించారు. వీరిని ఇంకా పూర్తిస్థాయిలో అరెస్ట్ చేయలేదు. వీరిలో పలువురి ఆచూకీ తెలియడం లేదని చెబుతున్నారు. కార్డన్ సెర్చ్ సందర్భంగా డిజిపి హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ 85 మందిపై హిస్టరీ షీట్లు ఓపెన్ చేశామన్నారు. ముగ్గురిపై పిడి యాక్ట్, మరో ఇద్దరిని బహిష్కరించేందుకు సిఫార్స్ చేశామన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు గుర్తిస్తే 112, 100కు డయల్ చేసి వివరాలు తెలపాలని కోరారు.

సిఎస్‌తో డిజిపి భేటీ

రాష్ట్రంలో ఎన్నికల రోజు, అనంతరం జరిగిన హింసపై సిట్ నివేదికను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డితో రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్ గుప్తా భేటీ అయ్యారు. సిట్ నివేదిక ఆధారంగా ఎన్నికల కమిషన్ ఎలాంటి చర్యలకు సిఫార్సు చేస్తుంది, ఆ సిఫార్సులను ఎలా అమలు పరచాలి అనే అంశంపై వీరిరువురు సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది.

విద్యార్థుల ఇళ్లకు టీచర్లు

- గృహ సందర్శన పేరుతో రాష్ట్రంలో ప్రత్యేక కార్యక్రమం
- సంవత్సరానికి రెండు సార్లు తప్పనిసరి : ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో



తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య బంధాలను బలోపేతం చేసే దిశగా ఈ విద్యాసంవత్సరం నుండే 'గృహ సందర్శన' కార్యక్రమాన్ని అమలు పరచబోతున్నామని పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ వెల్లడించారు యూకే, ఆస్ట్రేలియా దేశాల్లోని ప్రభుత్వ పాఠశాలలో విజయవంతమైన కార్యక్రమాల నుంచి స్ఫూర్తిపొంది ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలో ప్రవేశపెడుతున్నట్లు ఆయన తెలిపారు. ' ఫ్రమ్ ది డెస్క్ ఆఫ్ ది ప్రిన్సిపల్ సెక్రటరీ, 16వ ఎపిసోడ్ ' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మట్లాడుతూ విద్యార్థుల్లో ఉత్తీర్ణతతోపాటు, ఉన్నత మార్కులు సాధించేందుకు వీలుగా గృహ సందర్శన కార్యక్రమం దోహదం చేస్తుందని చెప్పారు, ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి తరగతి ఉపాధ్యాయుడు సంవత్సరానికి రెండుసార్లు తమ విద్యార్థుల ఇళ్లను సందర్శిస్తారని, విద్యా సంవత్సరం ప్రారంభంలో ప్రతి విద్యార్థికి ఉపాధ్యాయులు వ్యక్తిగత వార్షిక విద్యా ప్రణాళికలు రూపొందిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులతో తల్లిదండ్రులకు నమ్మకమైన సంబంధం ఏర్పడి.. వారి పిల్లలు విద్యలో పాలుపంచుకునేలా ప్రోత్స హిస్తుందని, అలాగే విద్యార్థుల హాజరు, ప్రవర్తన, అభ్యాసంలో మెరుగుదలకు దోహదం చేస్తుందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా 10 తరగతి, ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షల్లో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థులు సాధించిన మార్కుల మధ్య ఉన్న వ్యత్యాసంపై ఆయన చర్చించారు. 10 తరగతిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 600ల మార్కులకు సగటున 358 మార్కులు సాధిస్తే, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు 479 మార్కులు సాధించారని చెప్పారు.

జనం సొమ్ముతో బిజెపి భజన

- సిబిసి తీరుపై విమర్శల వెల్లువ
- 113 రోజుల్లో రూ.39 కోట్ల వ్యయం



ముంబయి : కేంద్ర ప్రభుత్వ పథకాలు, ప్రణాళికలను గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రచారాలు నిర్వహించేందుకు ఉద్దేశించిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సిబిసి) సార్వత్రిక సమరం వేళ సంఘ్ పరివార్ సేవలో మునిగితేలుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మోడీ గొప్పదనాన్ని కీర్తిస్తూ జనం సొమ్ముతో బిజెపికి భజన చేస్తోందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఎన్నికలకు ముందు మోడీ గురించి గొప్పలు చెబుతూ గూగుల్ యాడ్స్ కోసం సిబిసి పెద్ద ఎత్తున నిధులు వెచ్చించడం విమర్శలకు బలం చేకూర్చుతోంది. గత నవంబరులోనే దేశంలో సార్వత్రిక ఎన్నికల వేడి రాజుకుంది. అదే అదనుగా భావించిన బిజెపి ప్రభుత్వ సంస్థ అయిన సిబిసి ద్వారా భారీ స్థాయిలో రాజకీయ ప్రకటనలు గుప్పించడం ప్రారంభించింది. 'మోడీ కీ గ్యారంటీ' అనేది మోడీ వ్యక్తిగత హామీ. కానీ దానికి సిబిసి ప్రచారం కల్పించింది. మోడీ కీ గ్యారంటీ అనే ట్యాగ్‌లైన్‌తో నవంబర్ మూడో వారం నుండే గూగుల్‌లో బిజెపి ప్రచారం ప్రారంభించింది. అదే సమయంలో మరో సంస్థ దాదాపు అదే తరహా ప్రచారం కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేయడం మొదలు పెట్టింది. దానికి 'మోడీ సర్కార్ కీ గ్యారంటీ' అని పేరు పెట్టింది. అయితే కొన్ని నెలల పాటు కొనసాగిన ఆ వీడియో ప్రకటనలో మోడీ గ్యారంటీ అనే చెప్పుకున్నారు.

కాంగ్రెస్ ఫిర్యాదు

సిబిసి ప్రకటనలు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని, ఆ సంస్థ పాలక పక్షం ప్రచారం కోసం ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేస్తోందని ఆరోపిస్తూ మార్చి 22న ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. బిజెపి ప్రచారం కోసం ప్రజాధనాన్ని ఉపయోగించడంపై అల్ జజీరా ఛానల్ విచారణ చేపట్టింది.

రికార్డు స్థాయిలో సిబిసి ఖర్చు

సుమారు నాలుగు నెలల వ్యవధిలోనే గూగుల్ ప్రకటనల కోసం సిబిసి రూ.38.7 కోట్లు ఖర్చు చేసిందని అల్ జజీరా తేల్చింది. నవంబరులో మిగతా 2లో

బ్రిజ్‌భూషణ్‌పై ఛార్జిషీట్

న్యూఢిల్లీ : మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి, భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ ఛీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఎట్టకేలకు ఛార్జిషీట్ నమోదైంది. అతడిపై ఢిల్లీ కోర్టు మంగళవారం అభియోగాలు నమోదు చేసింది. క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడటం, ఆపై బెదిరించడం వంటి అభియోగాలు నమోదయ్యాయి. అతడితో పాటు ఈ కేసులో సహ నిందితుడిగా ఉన్న డబ్ల్యుఎఫ్ఐ మాజీ సహాయక కార్యదర్శి వినోద్ తోమర్‌పై కూడా బెదిరింపులకు పాల్పడిన నేరం కింద అభియోగాలను కోర్టు నమోదు చేసింది. కాగా అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ (ఎసిఎంఎం) ప్రియాంక రాజ్‌పూత్ ముందు విచారణకు హాజరైన బ్రిజ్‌భూషణ్ తన నేరాన్ని అంగీకరించలేదు. 'నేను దోషి కానప్పుడు ఎందుకు నేరాన్ని అంగీకరిస్తాను' అని వాదించాడు. బ్రిజ్‌భూషణ్ తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో రెజ్లర్లు ఆందోళన చేయడం దేశవ్యాప్తంగా సంచలనమైన సంగతి విదితమే. ఈ నేపథ్యంలోనూ బ్రిజ్ భూషణ్‌తో బిజెపి తన అనుబంధాన్ని కొనసాగించింది. ఆయన ప్రాతి నిధ్యం వహిస్తున్న ఉత్తరప్రదేశ్‌లోని కైసర్‌గంజ్ లోక్‌సభ స్థానం నుంచి అతడి కుమా రుడు కరణ్ భూషణ్ సింగ్‌ను బిజెపి బరిలోకి దింపింది.

రాయదుర్గంలో ఎన్ఐఎ సోదాలు

- నిందితుణ్ని బెంగళూరుకు తరలింపు!

ప్రజాశక్తి– రాయదుర్గం (అనంతపురం జిల్లా)

అనంతపురం జిల్లా రాయదుర్గం వేణుగోపాలస్వామి గుడి వీధిలోగల రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు అబ్దుల్లా ఇంట్లో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) అధికారులు మంగళవారం తెల్లవారుజామున సోదాలు నిర్వహించారు. ఆయన పెద్ద కుమారుడు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సోహెల్‌ను అదుపులో తీసుకొని విచారించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించి రెండు గంటల పాటు విచారణ తర్వాత ఆ యువకుడిని బెంగళూరుకు తీసుకెళ్లినట్టు సమాచారం. సోహెల్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. వర్క్‌ఫ్రం హోం కారణంగా కొంతకాలంగా ఇంట్లోనే విధులు నిర్వహిస్తున్నారు. సోహెల్‌కు ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయనే సమాచారంతో ఎన్ఐఎ అధికారులు రాయదుర్గంలో తనిఖీలు చేశారు. ఆయన ఫోన్‌కాల్ డేటాను పరిశీలించినట్లు సమాచారం. సోహెల్‌కు చెందిన రెండు ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. సోహెల్ బెంగళూరులో ఉన్నప్పుడు ఉగ్రవాదులు ఆయన ఫోన్‌ను ఉపయోగించినట్లు ఎన్ఎఐ అధికారులు అనుమానిస్తున్నారు. బెంగళూరులోని రామేశ్వరం కేఫ్‌లో మార్చి మొదటి తేదీన భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ప్రధాన నిందితులను పశ్చిమ బెంగాల్లో ఎన్ఐఎ అధికారులు అరెస్టు చేశారు. విచారణలో వారి నుంచి సేకరించిన వివరాల ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశారు. సోదాల సమయంలో ఆ ఇంటి సమీపానికి, పోలీస్ స్టేషన్ వద్దకు ఎవరినీ రానివ్వలేదు. ఎటువంటి సమాచారమూ మీడియాకు వెల్లడించలేదు. రాయదుర్గంలో ఎన్ఐఎ దర్యాప్తు సంచలనం సృష్టించింది.



సోహెల్‌ను కారులో తీసుకెళ్తున్న ఎన్ఐఎ అధికారులు

నాలుగు రాష్ట్రాల్లోని 11 ప్రాంతాల్లో సోదాలు

రామేశ్వరం కేఫ్ బ్లాస్ట్ కేసుకు సంబంధించి నాలుగు రాష్ట్రాల్లోని 11 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించినట్టు ఎన్ఐఎ ఒక ప్రకటనలో తెలిపింది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ తనిఖీలు కొనసాగాయి. ఈ కేసులో 11 మంది అనుమానితుల ఇళ్లలో సోదాలు జరిగినట్లు పేర్కొంది.



పోలింగ్ బూత్‌లో ఇవిఎంను కింద పడేసిన ఎంఎల్ఎ పిన్నెల్లి

ఇవిఎమ్‌ను ధ్వంసం చేసిన పిన్నెల్లి

- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- కఠిన చర్యలకు ఇసి ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మాచర్ల నియోజకవర్గం రెంటచింతల మండలం పాల్వాయి గేట్ పోలింగ్ కేంద్రం (202) నెంబరు బూత్‌లో స్థానిక ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి స్వయంగా ఇవిఎమ్‌లు ధ్వంసం చేస్తున్న వీడియో మంగళవారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఎన్నికలు జరిగే రోజు, ఎన్నికల అనంతరం జరిగిన హింస, అల్లర్లపై సిట్ దర్యాప్తు వేగవంతం చేస్తుండటం, మరోకవైపు అరెస్ట్‌ల పర్వం కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వీడియా బయటకు రావడంతో రాజకీయ వర్గాల్లో హాట్‌హాట్ చర్చకు తెరలేపింది. ఇవిఎమ్ ధ్వంసాన్ని అడ్డుకున్న ఏజెంట్‌పై ఎమ్మెల్యే అనుచరులు దాడికి దిగిన దృశ్యం కూడా వెబ్ కెమెరాలో రికార్డయింది. ఈ నేపథ్యంలో అరెస్ట్ చేస్తారనే భయంతోనే ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గృహ నిర్బంధం నుంచి గన్‌మెన్‌లను వదిలి హైదరాబాద్‌కు వెళ్లాడని టిడిపి ఆరోపిస్తోంది.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇసి ఆదేశం

మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గంలోని పిఎస్ నంబర్ 202తో పాటు ఏడు పోలింగ్ కేంద్రాల్లో ఇవిఎంలను ధ్వంసం చేసినట్లు ఎన్నికల కమిషన్ ఒక ప్రకటనలో పేర్కొంది. పిఎస్ నెంబర్ 202లో జరిగిన ఘటనలో సిట్టింగ్ ఎమ్మెల్యే పి.రామకృష్ణారెడ్డి వెబ్ కెమెరాలో రికార్డ అయ్యారని మిగతా 2లో

హజ్ యాత్రకు మూడు ప్రత్యేక విమానాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లే యాత్రికుల కోసం మూడు ప్రత్యేక విమానాలను కేటాయించినట్లు ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ తెలిపింది. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ నెల 27వ తేదీ మొదటి విమానం, 28వ తేదీ రెండవ విమానం, 29వ తేదీ మూడవ విమానం గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి సౌదీ అరేబియాలోని జెడ్డా విమానాశ్రయానికి చేరుకుంటాయని తెలిపింది. సదరు యాత్రికులకు వారి ప్రయాణ వివరాలను, హజ్ క్యాంప్‌నకు రిపోర్టింగ్ చేయు సమయాలను వాట్సాప్ ద్వారా పంపినట్లు పేర్కొంది. హజ్ క్యాంప్‌ను గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలోని ఈద్గా జామ మసీదులో ఏర్పాటు చేశామని తెలిపింది. అలాగే యాత్రికుల సౌకర్యార్థం 1800-4257873 టోల్ ఫ్రీ నెంబరు కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది.

రాజీవ్ గాంధీ సేవలు ఎనలేనివి

- పళ్లంరాజు నివాళి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి ఎనలేని సేవలు అందించారనికేంద్ర మాజీ మంత్రి ఎమ్ఎమ్ పళ్లంరాజు నివాళు లర్పించారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం విజయవాడలోని ఆంధ్రరత్నభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం మాట్లాడుతూ సైన్స్, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి కోసం రాజీవ్ గాధీ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కొలనుకొండ శివాజీ, వి.గురునాధం, పి.వై.కిరణ్, షేక్‌నాగూర్, విజయవాడ కాంగ్రెస్ అధ్యక్షులు నరహరశెట్టి నరసింహారావు, తదదితరులు పాల్గొని రాజీవ్‌గాంధీకి నివాళులర్పించారు.



రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు

తిరుమలకు చేరుకున్న తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి

- టిటిడి అధికారులు ఘన స్వాగతం

ప్రజాశక్తి -తిరుమల

శ్రీవారి దర్శనార్థం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిరుమలకు చేరుకున్నారు. మంగళవారం రాత్రి పద్మావతి నగర్‌లోని అతిథి గృహం వద్దకు చేరుకున్న రేవంత్‌రెడ్డి దంపతులకు టిటిడి ఇఒ ధర్మారెడ్డి స్వాగతం పలికారు. రాత్రికి తిరుమలలో రేవంత్ రెడ్డి బస చేశారు. తన మనవడికి పుట్టు వెంట్రుకలు స్వామివారికి సమర్పించనున్నారు. బుధవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో రేవంత్‌రెడ్డి దంపతులు స్వామి వారిని దర్శించుకొని తిరుగు ప్రయాణం కానున్నారు.

సంఘ్ పరివార్‌లో మోడీపై మంటలు!

(మొదటి పేజీ తరువాయి)

ఆయనను బహిరంగంగానే అగౌరవపరిచిన తీరు సంఘ్‌పరివారంలో చర్చనీయాంశంగా మారింది. ఉమాభారతి వంటి నేతలను దూరంగా ఉంచిన తీరు కూడా వారి ఆగ్రహానికి కారణమని చెబుతున్నారు. తాజా ఎన్నికల్లో సైతం బిజెపి అంటే మోడీ, మోడీ అంటే బిజెపిగా ప్రచారం సాగిన విషయం తెలిసిందే. మోడీ లేని చోట్ల అమిత్‌షా, నడ్డాలు కనిపించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్‌తో పాటు, బిజెపికి చెందిన ఇతర రాష్ట్రాల సిఎంలకు ప్రాధాన్యత ఇవ్వలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతొంది.

రామాలయమూ వివాదాంశమే...

ఎన్నికల ముందు అట్టహాసంగా నిర్వహించిన ఆయోధ్య రామమందిర ప్రారంభం కూడా సంఘ్ పరివార్‌కు, మోడీ పరివార్‌కు మధ్య వివాదాలను మరింత రాజేసిందని చెబుతున్నారు. రథయాత్ర నిర్వహించిన అద్వాని లాంటి వారిని ఆ కార్యక్రమానికి దూరంగా పెట్టిన మోడీ పరివారం సంఘ్ నేతలకు కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని ఆర్‌ఎస్‌ఎస్ శ్రేణులు భావిస్తున్నాయి. ఆ కార్యక్రమం అంతా మోడీ మయంగా మారిన విషయం తెలిసిందే.

సిట్ నివేదికను బహిర్గత పర్చాలి

(మొదటి పేజీ తరువాయి)

మంది సంగతి ఏమైందో తెలియాల్సిన అవసరం వుందన్నారు. ఈ కేసుల్లో వున్న వారిలో అనేకమంది పరారీలో వున్నారని కథనాలు వస్తున్నాయి. శాంతిభద్రతల పరిరక్షణే ఏకైక లక్ష్యంగా పోలీసు యంత్రాంగం ఎవరి ఒత్తిళ్లకూ లొంగకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. రాష్ట్ర ప్రజలకు అధికార యంత్రాంగం, ఎన్నికల కమిషన్ అటువంటి భరోసా కల్పించడం అవసరముందని పేర్కొన్నారు. సిట్ నివేదికను బహిర్గతపరిస్తే పారదర్శకత పెరిగి ప్రజలకు విశ్వాసం కలిగే అవకాశముందని, తక్షణం సిట్ నివేదికను బహిరంగ పర్చాలని డిమాండ్ చేశారు.

కరువు సీమలో నకిలీ ప(క్ర)త్తి!

- నష్టపోతున్న రైతులు

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

కరువు నేలపై నకిలీ విత్తనాలు పత్తి రైతుల మెడపై కత్తిలా మారుతున్నాయి. ఖరీఫ్ సాగు ప్రారంభానికి ఇంకా సమయం ఉన్నా ఇప్పటికే మార్కెట్లో నకిలీ పత్తి విత్తనాల విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. యుఎస్, కావేరి, 609, ఆధ్యా, భౌన్సర్, గాయిత్రి గోల్డ్, వేద, జాదూ, నందిని, శక్తి ప్లస్, సదానంద తదితర రకాల పేరుతో వీటిని విక్రయిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు కేంద్రంగా రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు కూడా ఈ నకిలీ విత్తనాలు సరఫరా అవుతున్నాయి. విక్రయాలు సాగించే దళారులతో వ్యవసాయ శాఖలోని కొందరు కీలక అధికారులు కుమ్మక్కైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పత్తి సాధారణ సాగు ఆరు లక్షల ఎకరాలు. గతేడాది 6.25 లక్షల ఎకరాల్లో సాగైంది. ఈ ఏడాది సాగు లక్ష్యం రూ.6.50 లక్షల ఎకరాలు. సాగు పెరుగుతున్నా నకిలీ విత్తనాలపై అధికారులు దృష్టి సారించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. నకిలీ విత్తనాల విక్రేతలకు కొందరి రాజకీయ నాయకుల అండదండలు ఉన్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎమ్మిగనూరు, ఆదోని, కోడుమూరు, పత్తికొండ, తుగ్గలి, గూడూరు, సి.బెళగల్, మంత్రాలయం ప్రాంతాల్లో యథేచ్ఛగా నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తున్నారు. వీటిని కొనుగోలు చేసి దిగుబడి రాక పత్తి రైతులు పూర్తిగా నష్టపోతున్నారు. ఎలాంటి అనుమతులూ లేకున్నా పట్టణాల్లో వివిధ పేర్లతో ఉన్న ప్యాకెట్లలో, గ్రామాల్లో లూజు విత్తనాల పేరుతో ఈ విక్రయాలు సాగుతున్నాయి. తక్కువ ధరతో నాణ్యమైన దిగుబడి వస్తుందంటూ రైతులకు ఆశ చూపుతున్నారు. మార్కెట్లో 400 గ్రాముల పత్తి విత్తనాల ప్యాకెట్ రూ.800 నుంచి రూ.వెయ్యి ఉంటే, నకిలీ విత్తనాలను కిలో రూ.700 నుంచి రూ.900కు విక్రయిస్తున్నారు. దిగుబడి సరిగ్గా రాకపోతే డబ్బు వెనక్కి ఇస్తామని కూడా నమ్మబలుకుతున్నారు. కొన్న విత్తనాలకు రశీదులు మాత్రం ఇవ్వడం లేదు. నకిలీ విత్తనాల వల్ల మోసపోయామని తెలుసుకున్న రైతులు విక్రయదారులను ప్రశ్నిస్తే భూమి సరిగ్గా లేదనో, నీరు సరిగ్గా అందలేదనో సాకులు చెబుతుండడం షరా మామూలుగా మారింది. జిల్లాలో కొన్నేళ్లుగా ఇదే తంతు సాగుతున్నా అధికారులు మాత్రం ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. 2021 ఖరీఫ్‌లో కావేరీ జాదు విత్తనాల వల్ల 18 మండలాలకు చెందిన 1,899 మంది రైతులు నష్టపోయారు. 2022లో నష్టపోయిన వారు సుమారు 1,500, 2023 నష్టపోయిన వారు కూడా అంతే సంఖ్యలో ఉంటారని అంచనా. వీరికి కంపెనీల నుంచి ఎటువంటి నష్టపరిహారమూ అందలేదు.



మార్కెట్‌లో విక్రయిస్తున్న నకిలీ పత్తి విత్తనాలు

అరువుపైనా ఇస్తారు..

నకిలీ విత్తనాలను అరువుపై కూడా విక్రయిస్తున్నారు. అప్పుకు ప్రాంసరీ నోటు రాయించుకుంటున్నారు. పంట చేతికి రాక నష్టాల్లో కూరుకుపోయినా రైతు నుంచి ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తున్నారు. నకిలీ వ్యవహారంతో రైతులు అప్పుల పాలవుతున్నారు.

నకిలీలను అరికట్టాలి

నకిలీ విత్తనాలను ప్రభుత్వం ఆరికట్టాలి. ఒక పక్క కరువు, మరో పక్క ధర లేక ఇబ్బందులు పడుతున్న రైతులను నకిలీ విత్తనాలు తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. వీటిని విక్రయించే వారిపై వ్యవసాయ శాఖ కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలను అందించి రైతులు నష్టపోకుండా ఆదుకోవాలి.

-జి.రామకృష్ణ,
ఎపి రైతు సంఘం కర్నూలు జిల్లా కార్యదర్శి

మళ్లీ వైసిపిదే అధికారం

- రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



చేసిన అభివృద్ధిని చూపించి ఓటు అడిగిన ఏకైక నాయకుడు జగన్ మాత్రమేనని, ప్రధాని మోడీ కూడా అభివృద్ధి చూపకుండా రామాలయం, మైనార్టీలను బూచిగా చూపి ఓట్లడుగుతున్నారని రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. రాష్ట్రంలో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే వస్తుందని, ప్రజలంతా జగన్ ప్రభుత్వానికి పట్టం కట్టబోతున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం విజయవాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రానున్న ఎన్నికల ఫలితాల్లో 175 సీట్లను వైసిపి కైవసం చేసుకోబోతోందని అన్నారు. జూన్ 9వ తేదీన జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపట్టణంలో ప్రమాణ స్వీకారం చేస్తారని చెప్పారు. విద్య, వైద్య రంగాలకు సంబంధించి వైసిపి ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన సంస్కరణలను అధికారంలోకి రాగానే కొనసాగిస్తామని వివరించారు. ఇంగ్లీషు మీడియం విద్యాబోధన, టోఫెల్ శిక్షణ, సిబిఎస్ఇ సిలబస్, బైజ్యూస్ కరిక్యులమ్ తదితర సంస్కరణలు వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిందని చెప్పారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, విద్యాకానుక వంటి పథకాలతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా కల్పించామని బొత్స వివరించారు.

చంద్రబాబు ఏ దేశానికి పారిపోయారు? : జోగి రమేష్

టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు ఎక్కడికి వెళ్లారు? ఏమైపోయారు? ఆయన ఏ దేశానికి పారిపోయారు? అని మంత్రి జోగి రమేష్ ప్రశ్నించారు. తాడేపల్లిలో మీడియాతో మాట్లాడిన ఆయన.. రాష్ట్ర ప్రజలతోపాటు టిడిపి నేతలకూ చంద్రబాబు ఎక్కడ ఉన్నారో తెలియడం లేదన్నారు. త్వరలో టిడిపి అడ్రస్ గల్లంతవుతుందని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నాయకుడు ఎక్కడకు వెళ్లాడో రాష్ట్ర ప్రజలకు తెలియాలన్నారు. ప్రజల ఆశీస్సులతో ఘన విజయం సాధించబోతున్నామని అన్నారు.

ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చారు

- దేవినేని ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆరోగ్యశ్రీని జగన్ ప్రభుత్వం అనారోగ్యశ్రీగా మార్చిందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులను సిఎం జగన్ దారిమళ్లించారని అన్నారు. ఆసుపత్రులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు రూ.1500 కోట్లు చెల్లించకుండా, ఆస్మదీయ కాంట్రాక్టర్లకు రూ.15 వేల కోట్ల బిల్లులు చెల్లించారని చెప్పారు. మంగళగిరి టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఓటమి భయంతోనే వైసిపి నేతలు రాష్ట్రంలో రక్తపాతం సృష్టిస్తున్నారన్నారు. పిఎమ్‌జెవై కింద ఒక్కో ఫ్యామిలీకి కేంద్రం నుంచి వచ్చిన రూ.5 లక్షలను ఏమి చేశారో లెక్కల్లో కనిపించడం లేదని దేవినేని పేర్కొన్నారు. పేదల ఆరోగ్యం పట్ల చీఫ్ సెక్రటరి, హెల్త్ సెక్రటరీలు స్పందించి ఆసుపత్రులకు కట్టాల్సిన బకాయిలు చెల్లించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

నీటిపై హక్కుల కోసం ఉద్యమిద్దాం

- కొల్లి నాగేశ్వరరావు వర్ధంతి సభలో వక్తల పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సాగు, తాగు నీరు, పరిశ్రమల అవసరాల కోసం నదీ జలాల హక్కులు కాపాడుకోవటానికి ప్రతి ఒక్కరూ కషి చేయాలని, ఉద్యమించాలని వక్తలు అభిప్రాయపడ్డారు. రైతు, కమ్యూనిస్టు ఉద్యమ నాయకులు కొల్లి నాగేశ్వరరావు 4వ వర్ధంతిని పురస్కరించుకుని విజయవాడలోని దాసరి భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సుల్లో 'కృష్ణా జలాల హక్కుల పరిరక్షణ- కొత్త ప్రభుత్వం ముందున్న సవాలు' అనే అంశంపై వక్తలు ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రముఖ సామాజిక విశ్లేషకులు టి లక్ష్మీనారాయణ రచించిన 'కృష్ణా జలాల హక్కుల పరిరక్షణ- కొత్త ప్రభుత్వం ముందున్న సవాలు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడారు. మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు నల్లచట్టాలను వ్యతిరేకిస్తూ ఢిల్లీ సరిహద్దుల్లో ఏడాదికిపైగా రైతాంగం చేసిన పోరాటం చారిత్రాత్మకమన్నారు. రాష్ట్రంలో అమరావతి రైతులు, విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులు చేసిన ఉద్యమాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. కృష్ణా జలాల విషయంలో కేంద్ర జలశక్తి మంత్రి ఛైర్మన్‌గా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉన్న అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్రానికి 512 టిఎంసీలు, తెలంగాణకు 299 టిఎంసీలు వినియోగించుకోవాలన్న బచావత్ ట్రిబ్యునల్ ఆదేశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఉన్న నీటి ప్రాధాన్యత అంశాల్లో మార్పు వచ్చిందని, నీరు వాణిజ్య సరుకుగా మారిందన్నారు. దీంతో నదీజలాలపై ఉన్న హక్కులను కేంద్రం తన నియంత్రణలోకి తీసుకుంటుందన్నారు. నీటి పాలసీపై విధానాలు రూపొందించుకుని హక్కుల సాధనకు పోరాటాలు చేయాలన్నారు. ఈ సందర్భంగా సామాజిక విశ్లేషకులు టి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కొల్లి నాగేశ్వరరావు రైతాంగ ఉద్యమ నిర్మాణంలో ప్రముఖపాత్ర పోషించారని గుర్తు చేశారు.



కృష్ణా జలాల హక్కుల పరిరక్షణ- కొత్త ప్రభుత్వం ముందున్న సవాలు పుస్తకావిష్కరణలో నాయకులు

కేంద్రంలో, రాష్ట్రంలో ఏర్పడే కొత్త ప్రభుత్వాలు ఆంధ్రప్రదేశ్ నీటి హక్కుల కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. రైతు సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు కృష్ణానది మిగులు జలాలను రాష్ట్రం వినియోగించుకునే స్వేచ్ఛ లేకుండా చేసిందన్నారు. ట్రిబ్యునల్ తీర్పు చెప్పేనాటికి పూర్తికాని పులిచింతల జలాశయం నిల్వను లెక్కించిందన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్, తుంగభద్ర జలాశయాల్లో పూడికవల్ల తగ్గిపోయిన నీటి నిల్వలను ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోకుండా తీర్పు ఇవ్వటంతో కృష్ణా జలాలపై హక్కు లేకుండా పోయిందన్నారు. రైతుసంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు మాట్లాడుతూ కృష్ణా, గోదావరి నదులపై ఉన్న ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసుకుంటే ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాజెక్టులకు మేలు జరుగుతుందన్నారు. ఎపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి ఈశ్వరయ్య అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో రైతుసంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్, రైతు నాయకులు అక్కినేని భవానీ ప్రసాద్, పల్లా రాజమోహన్, డి హరినాథ్, సాంబశివరావు, మర్రెడ్డి వెంకటరెడ్డి, కొల్లా రాజ్‌మోహన్, వెలగపూడి ఆజాద్ తదితరులు మాట్లాడారు.

వైభవంగా గంగమ్మ జాతర




- మొక్కులు చెల్లించుకున్న యాత్రికులు, రాజకీయ నేతలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, తిరుమల

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. మొక్కులు తీర్చుకునేందుకు యాత్రికులు పెద్ద సంఖ్యలో ఆలయం వద్దకు తరలివచ్చారు. అమ్మవారిని వజ్ర కిరీటంతో అర్చకులు అలంకరించారు.

గంగమ్మను టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, తిరుపతి మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి, తిరుపతి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరని శ్రీనివాసులు కుటుంబ సభ్యులు, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబసభ్యులు దర్శించుకున్నారు. వారితో పాటు జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, తిరుపతి అర్బన్ ఎస్‌పి హర్షవర్ధన్ రాజు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదితి సింగ్ విచ్చేశారు.

సుమారు 60వేల మంది యాత్రికులు ఆలయ సమీపంలో పొంగళ్లు సమర్పించారు. మేయర్ శిరీషతో కలిసి భూమన కరుణాకర్‌రెడ్డి స్వయంగా అన్నప్రసాద వితరణ చేశారు. గంగమ్మ జాతర సందర్భంగా స్థానిక ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులకు ఐచ్ఛిక సెలవు ప్రకటించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. వారం రోజుల పాటు యాత్రికులు వివిధ వేషధారణలతో సందడి చేస్తున్నారు. ఈనెల 14న ప్రారంభమైన జాతర బుధవారం తెల్లవారుజాముతో ముగియనుంది.



మొక్కులు చెల్లించుకుంటున్న యాత్రికులు, ఇన్‌సెట్‌లో అమ్మవారు

ఆగస్టు నెల సేవా టికెట్లు విడుదల

తిరుమలలో వేసవి రద్దీ కొనసాగుతోంది. తిరుమల వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లన్నీ యాత్రికులతో నిండిపోయాయి. కంపార్టుమెంట్ల వెలుపల క్యూ లైన్లల్లో యాత్రికులు వేచి ఉన్నారు. సర్వదర్శనానికి టికెట్ లేని యాత్రికులకు 15 గంటల సమయం పడుతోంది. సోమవారం ఒక్క రోజే శ్రీవారిని 85,825 మంది దర్శించుకున్నారు. 36,146 మంది తలనీలాలు సమర్పించారు. తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4.4 కోట్లు వచ్చింది.

ఆర్జితసేవల టికెట్లు గంటలోనే బుకింగ్

మంగళవారం ఉదయం పది గంటలకు ఆగస్టు నెలకు సంబంధించిన ఆర్జిత సేవా టికెట్లను ఆన్‌లైన్‌లో టిటిడి విడుదల చేసింది. పవిత్రోత్సవాల, అష్టదళ పాదపద్మారాధన సేవల టికెట్లతో పాటు మధ్యాహ్నం మూడు గంటలకు వర్చువల్ సేవా టికెట్లను విడుదల చేసింది. ఈ టికెట్లు గంట వ్యవధిలోనే యాత్రికులు బుక్ చేసుకున్నారని టిటిడి తెలిపింది.

పిఎసిఎస్‌ల్లో రిటైర్మెంట్ వయసు 62

- హైకోర్టు కీలక తీర్పు

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో (పిఎసిఎస్) పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసు 62 ఏళ్లని హైకోర్టు స్పష్టం చేసింది. పిఎసిఎస్‌ల్లో రిటైర్మెంట్ వయసు 60 నుంచి 62 ఏళ్లుగా పరిగణించేలా ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వానికి తెలిపింది. ఉద్యోగుల్లో ఎవరైనా 60 ఏళ్లు నిండాక పదవీ విరమణ చేసి ఉంటే, ఇప్పటికి వాళ్ల వయసు 62 ఏళ్లు నిండకపోయి ఉంటే ఆ ఉద్యోగులను తిరిగి సర్వీసులోకి తీసుకోవాలని కూడా కోర్టు ఆదేశించింది. వాళ్లకు వేతన బకాయిలు చెల్లించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఇటీవల తీర్పు వెలువరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంచిన నేపథ్యంలో ఆ ఉత్తర్వులను తమకు కూడా అమలు చేయాలని కోరుతూ పిఎసిఎస్ ఉద్యోగులు హైకోర్టులో వ్యాజ్యాలను దాఖలు చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేయాలని పిఎసిఎస్‌లు తీర్మానం చేశాయని పిటిషనర్లు హైకోర్టు దృష్టికి తెచ్చారు. సహకార సంఘాల రిజిస్ట్రార్ ఆ తీర్మానాలను ఆమోదించకపోతే వాటికి విలువ ఉండదని, ప్రభుత్వ అనుమతి విధిగా ఉండాలని, ఈ మేరకు గతంలో హైకోర్టు తీర్పులు ఇచ్చాయని ప్రభుత్వం వాదించింది. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ గత తీర్పులు ఇప్పటి కేసులకు వర్తించవని తెలిపారు.

ఉద్యోగుల సహనాన్ని పరీక్షించొద్దు

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కుట్రలో భాగంగా ఉద్యోగుల జీతాలు నిలుపుదల చేసి వారి సహనాన్ని పరీక్షిస్తే స్టీల్ యాజమాన్యం తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1195వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఎఫ్‌ఎండి, ఆర్‌ఎస్ అండ్ ఆర్‌ఎస్, విఎస్‌జిహెచ్, ప్లాంట్ డిజైన్ విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, విల్లా రామ్మోహన్ కుమార్, డిసిహెచ్.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు మాట్లాడారు. స్టీల్ యాజమాన్య వైఖరిని ఖండిస్తూ బుధవారం అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో డెడికేషన్ పార్కు వద్ద తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర బిజెపి పాలనలో నియమితులైన స్టీల్ సిఎమ్‌డి, డైరెక్టర్లపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు.

పోలింగ్ ఏజెంట్ల నియామకంపై ఆర్‌ఓలకు ఇసి సరైన గైడ్‌లైన్స్ ఇవ్వాలి

- అడిషనల్ సిఇఓకు టిడిపి వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలింగ్ ఏజెంట్ల నియామకంపై ఆర్‌ఓలకు ఇసి సరైన గైడ్‌లైన్స్ ఇవ్వాలని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా రాజానగరం ఆర్‌ఓ సర్క్యులర్ జారీ చేశారని, కౌంటింగ్ ఏజెంట్లకు సరైన ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఈ మేరకు నక్కా ఆనందబాబు నేతృత్వంలోని టిడిపి ప్రతినిధుల బృందం మంగళవారం అడిషనల్ సిఇఓ కోటేశ్వరరావును కలిసి విజ్ఞప్తి చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జూన్ 4న జరగబోయే కౌంటింగ్ ప్రక్రియలోని కొన్ని విషయాలపై ఎన్నికల సంఘంతో చర్చించామని తెలిపారు. ఎక్కడా లేని విధంగా కౌంటింగ్ ఏజెంట్ల లిస్టు ఇవ్వాలని రాజానగరం రిటర్నింగ్ అధికారి సర్క్యులర్ జారీ చేశారన్నారు. గతంలో కూడా పోలింగ్ ఏజెంట్ల క్రిమినల్ ఆస్పిరెన్స్ ఇవ్వాలని ఆర్‌ఓ ఆదేశాలిస్తే ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లామన్నారు. అటువంటి రూల్ ఎన్నికల గైడ్‌లైన్స్‌లో ఎక్కడా లేదని సిఇఓ కార్యాలయం వివరణ ఇచ్చిందన్నారు. పోలింగ్ ఏజెంట్లను ఏ విధంగా అనుమతిచ్చారో అలానే కౌంటింగ్ ఏజెంట్ల అంశంలో కూడా సర్క్యులర్ జారీ చేయాలని సిఇఓను కోరినట్లు నక్కా ఆనందబాబు వెల్లడించారు. ఎన్నికల సంఘాన్ని కలిసిన వారిలో ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ ఎఎస్ రామకృష్ణ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టిబత్తిన చిట్టిబాబు, మీడియా కో-ఆర్డినేటర్ దారపనేని నరేంద్ర, భాస్కరరావు, దామోదర్‌రాజు పాల్గొన్నారు.

ఇవిఎమ్‌ను ధ్వంసం చేసిన పిన్నెల్లి

(మొదటి పేజీ తరువాయి)

తెలిపింది. ఇవిఎంల ధ్వంసం ఘటనకు సంబంధించి కేసు దర్యాప్తులో సహకరించేందుకు పల్నాడు జిల్లా ఎన్నికల అధికారులు అటువంటి అన్ని పోలింగ్ స్టేషన్ల వీడియో ఫుటేజీని పోలీసులకు అందజేశారని పేర్కొంది. విచారణలో ఎమ్మెల్యే పేరును నిందితుడిగా చేర్చినట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయాన్ని ఇసి చాలా తీవ్రంగా పరిగణిస్తూ, ఈ ఘటనల్లో ప్రమేయం ఉన్న వ్యక్తులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిజిపికి తెలియజేయాలని సిఇఒ ముఖేష్ కుమార్ మీనాను ఇసి ఆదేశించింది. తద్వారా ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించే విషయంలో భవిష్యత్తులో ఎవరూ ఇటువంటి దుశ్చర్యలకు సాహసం చేయరని భావిస్తున్నట్లు పేర్కొంది.

జనం సొమ్ముతో బిజెపి భజన

(మొదటి పేజీ తరువాయి)

ఆన్‌లైన్ వేదికపై ప్రకటనలు ఇవ్వడం మొదలు పెట్టిన ఆ సంస్థ మార్చి 15 వరకూ దానిని కొనసాగించింది. అదే రోజు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవడంతో ఈ ప్రచారానికి బ్రేక్ పడింది. ఆ కాలంలో గూగుల్‌లో ప్రకటనల కోసం అధిక మొత్తం వెచ్చించిన సంస్థగా సిబిసి రికార్డు సృష్టించింది. మొత్తంగా 113 రోజుల పాటు సిబిసి ప్రచారం కొనసాగింది. రెండో స్థానంలో ఉన్న బిజెపి రూ.31.4 కోట్లు ఖర్చు చేసింది. 2018 జూన్ నుండి ఈ ఏడాది మార్చి 15 వరకూ...అంటే సుమారు ఆరు సంవత్సరాల్లో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ పెట్టిన ప్రకటనల ఖర్చు రూ.27.5 కోట్లతో పోలిస్తే కేవలం 113 రోజుల్లో సిబిసి పెట్టిన వ్యయం 41% అదనం.

మోడీ కీ పరివార్ వెనుక...

సిబిసి ఇచ్చిన అనేక ప్రకటనలు నినాదాలతో నిండిపోయాయి. అవన్నీ బిజెపికి ప్రచారం చేసిపెట్టే సందేశాలే. తటస్థంగా ఉండాల్సిన ప్రభుత్వ సంస్థలను బిజెపి తన ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తోందని విమర్శలొచ్చినా..మోడీ సర్కార్ తన వైఖరి మార్చుకోకుండా హద్దు మీరి ప్రజల సొమ్ముతో తన ప్రచారపర్వం కొనసాగిస్తోంది. ప్రధానికి ఓ కుటుంబం అంటూ ఏదీ లేదని, ఆయన తన భార్యను వదిలేశారని, పిల్లలు లేరని మార్చిలో ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ విమర్శించిన సంగతి తెలిసిందే. సంసారం కష్టాలు ఆయనకు తెలియవని, అందువల్లే ధరలు పెంచేస్తూపోతు న్నారంటూ లాలూ అప్పట్లో మోడీకి చురకలంటిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. దీనిపై ఆఘమేఘాలపై స్పందించిన బిజెపి నేతలు తమ సామాజిక మీడియా ప్రొఫైల్స్‌ను మార్చేశారు. తమ పేర్ల పక్కన 'మోడీ కీ పరివార్' (మోడీ కుటుంబం) అని చేర్చారు. ఇప్పుడు ఎన్నికల సమరంలో సిబిసి అదే నినాదంతో మోడీకి, బిజెపికి పరోక్ష ప్రచారం చేస్తుండటం గమనార్హం.

వ్యక్తిగత ప్రకటనల కోసం...

'మోడీ కీ గ్యారంటీ' పేరుతో సిబిసి ప్రకటనలు విడుదల చేసింది. యూట్యూబ్, గూగుల్ యాడ్స్‌లో కూడా 'మోడీ కీ పరివార్' పేరిట ప్రకటనలు ఇచ్చింది. ఈ వ్యక్తిగత ప్రకటనల కోసం సిబిసి పెద్ద మొత్తంలో ఖర్చు చేసింది. సాయుధ దళాలతో కలిసి మోడీ దీపావళిని జరుపుకున్నట్లు మార్చి 9న ఓ ప్రకటన వచ్చింది. ఐదు రోజుల పాటు కొనసాగిన ఈ ప్రకటన కోసం సిబిసి రూ.5.50 లక్షలు ఖర్చు చేసింది. తొలి దశ పోలింగ్‌కు వారం రోజుల ముందు బిజెపి తన ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల చేసింది. అందులో మోడీ ఫొటో, కాషాయ రంగులు, మోడీ కీ గ్యారంటీ నినాదం ఉన్నాయి. ప్రజాధనంతో సిబిసి ఇచ్చిన ప్రకటనల్లో ఇవన్నీ ఉన్నాయి.

బిజెపి ముందస్తు కుయుక్తులు

ప్రభుత్వ ప్రకటనల్లో రాజకీయ ప్రయోజనాలను ప్రచారం చేయకూడదని, అవి విధిగా ప్రభుత్వ కర్తవ్యాలకు సంబంధించినవై ఉండాలని 2015లో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయినప్పటికీ బిజెపి ప్రభుత్వం దీనిని ఖాతరు చేయడం లేదు. 2023 మేలో...అంటే సార్వత్రిక సమరానికి సంవత్సరం ముందు మోడీ ప్రభుత్వం సిబిసి బడ్జెట్‌ను ఏకంగా 275% పెంచేసింది.

వివిధ మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ విభాగాలు తమ ప్రకటనలు, ప్రచార బడ్జెట్‌లో 40% విధిగా సిబిసి కి ఇవ్వాలని నిర్దేశించింది. తద్వారా ఎన్నికల సంవత్సరంలో ఆ సంస్థ ఆర్థిక వనరులను బాగా పెంచింది. వార్తా పత్రికలు, టీవీ, రేడియో, ఔట్‌డోర్ ప్రకటనలకే పరిమితమైన సిబిసి , గూగుల్ వంటి డిజిటల్ వేదికలను కూడా ఉపయోగించుకునేందుకు అవకాశం కల్పిస్తూ గత సంవత్సరం నవంబరులో ప్రభుత్వం నూతన డిజిటల్ ప్రచార విధానాన్ని తీసుకొచ్చింది. దీంతో డిజిటల్ వేదికల్లో ప్రచార ఖర్చు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయింది. ఇవన్నీ బిజెపి ముందస్తు కుయుక్తులే.

తిరుపతి డిఎస్‌పిగా రవి మనోహర ఆచారి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి డిఎస్‌పిగా కె. రవి మనోహర ఆచారి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఎసిబి డిఎస్‌పిగా విధులు నిర్వహిస్తున్న ఆయన ఎన్నికల పోలింగ్ రోజు, ఆ మరుసటి రోజు తిరుపతి, చంద్రగిరిలో జరిగిన ఘర్షణలపై విచారణ చేపట్టిన సిట్ బృందానికి నాయకత్వం వహించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. తిరుపతిలో శాంతి భద్రతలను కాపాడడంలో తన వంతు కృషి చేస్తానని, గంగమ్మ జాతర, త్వరలో జరగబోయే ఎన్నికల కౌంటింగ్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటానన్నారు. గతంలో ఆయన తిరుపతి ఈస్ట్ సిఐగా పనిచేశారు.

మాజీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు మృతి

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్



ప్రముఖ రాజకీయవేత్త, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు (71) మంగళవారం తెల్లవారుజామున కన్నుమూశారు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారు. కృష్ణబాబుకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇటీవల ఆయన భార్య అనారోగ్యంతో మృతి చెందారు. 1983 నుంచి 94 వరకూ వరుసగా నాలుగుసార్లు కొవ్వూరు నుంచి టిడిపి ఎమ్మెల్యేగా కృష్ణబాబు ఘన విజయం సాధించారు.

1999లో ఓటమి చెంది, 2004లో ఐదోసారి ఎమ్మెల్యే గెలిచి ఆయన రికార్డు సృష్టించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డికి సన్నిహితుడు కావడంతో వైసిపిలో కొన్నేళ్ల క్రితం చేరారు. 2009లో కొవ్వూరు నియోజకవర్గం ఎస్‌సి రిజర్వు కావడంతో ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నారు. 2019 ఎన్నికల్లో ప్రస్తుత మంత్రి తానేటి వనితకు కొవ్వూరు అసెంబ్లీ వైసిపి టికెట్ ఇప్పించడంతోపాటు ఆమె విజయానికి కృషి చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుదీర్ఘకాలం రాజకీయాల్లో కృష్ణబాబు చక్రం తిప్పారు. టిడిపిలో ఉండగా కొవ్వూరు నియోజకవర్గంతో పాటు పోలవరం, గోపాలపురం నియోజకవర్గాల్లో అభ్యర్థుల విజయానికి వెన్నుదన్నుగా నిలిచారు.

ఒకే సిలబస్ అమలు చేయాలి

- ఉపాధ్యాయులకు బోధనేతర పనులు ఎత్తివేయాలి
- యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఒకే సిలబస్ విధానాన్ని అమలు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు పూర్తిగా ఎత్తివేయాలని, విద్యార్థులకు బోధించేందుకు ఉపాధ్యాయులకు సమయం ఉండేలా చూడాలని కోరారు. మంగళవారం ఆయన కర్నూలులో మీడియాతో మాట్లాడారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ ప్రాథమిక పాఠశాలలను ఒకేచోట పెట్టాలని కోరారు. జిఒ నెంబర్ 117ను వెంటనే రద్దు చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 23 వేల ఉపాధ్యాయ పోస్టులన్నింటినీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 1998-2008 డిఎస్‌సి ద్వారా నియమితులైన ఎంటిఎస్ ఉపాధ్యాయులను, ట్రైబల్ వెల్ఫేర్ స్కూళ్లలో పనిచేస్తున్న సిఆర్‌టిలను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. రాష్ట్రంలో నూతన విద్యా విధానాన్ని అమలు చేయకుండా ప్రస్తుతం ఉన్నటువంటి విద్యావిధానాన్ని మరింత బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలన్నిటినీ పరిష్కరించాలని కోరారు. విలేకర్ల సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్‌కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్‌పాటి, జిల్లా సహాధ్యక్షుడు హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

పల్నాడు అల్లర్లపై పూర్తిస్థాయి విచారణ చేయండి

- లావు శ్రీకృష్ణ దేవరాయలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు జిల్లాలో జరిగిన అల్లర్లపై మరింత లోతుగా దర్యాప్తు చేయాలని నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు డిమాండ్ చేశారు. గుంటూరు విద్యానగర్‌లో టిడిపి మాచర్ల అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డితో కలిసి ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. పల్నాడులో 85 శాతానికిపైగా పోలింగ్ జరగడంతో వైసిపి తట్టుకోలేకపోతుందన్నారు. ఎన్నికల్లో గెలుపు కోసం అల్లర్లను ఒక అస్త్రంగా ఎంచుకుందని ఆరోపించారు. వైసిపి దాడుల్లో గాయపడిన వారిలో 75 శాతం మందికి గతంలో ఎలాంటి నేర చరిత్ర లేదన్నారు. కేవలం టిడిపి తరపున ఏజెంట్లుగా ఉండటం, ఓట్లు వేయడం వల్లే వారిపై దాడి చేశారని విమర్శించారు. ముగ్గురు సిఐలు, ముగ్గురు ఎస్‌ఐలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పుట్టినరోజు వేడుకలకు హాజరు కావడం అధికార దుర్వినియోగం కాదా? అని ప్రశ్నించారు. వైసిపి నేతలు, పోలీస్ అధికారుల ఫోన్ కాల్ డేటాను సిట్ అధికారులు పరిశీలించి వాస్తవ దోషులను గుర్తించాలని కోరారు. మాచర్ల నియోజకవర్గంలో దాడులకు వైసిపి అనుకూల పోలీసు అధికారులే కారణమని విమర్శించారు. పల్నాడు జిల్లాలో 150 పోలింగ్ కేంద్రాల వద్ద గొడవలు జరుగుతాయని ముందుగానే చెప్పినా పోలీసులు స్పందించలేదన్నారు. సిట్ అధికారులు దీనిపైనా విచారణ జరపాలని కోరారు. గొడవలు జరిగినా పోలీసు అధికారులు ఎందుకు స్పందించలేదో చెప్పాలని ప్రశ్నించారు. పోలీసు అధికారులు ఎవరితో ఫోన్లు మాట్లాడారో సిట్ అధికారులు విచారణ జరపాలని కోరారు. జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ.. ఏ తప్పు చేయకపోతే మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి ఎందుకు పారిపోయారని ప్రశ్నించారు. ఆయన ఇంట్లో ఆయుధాలు ఎందుకు ఉన్నాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పిన్నెల్లి హింసను ప్రేరేపించిన మాట వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు.

అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు తులసి హఠాన్మరణం

- పలువురు సంతాపం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)



ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా అధ్యక్షులు వై.తులసి (50) సోమవారం రాత్రి అల్లిపురంలోని తన నివాసంలో గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు. ఆమెకు భర్త శ్రీనివాస్, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి తులసి ఎనలేని కృషి చేశారు. ఈ ఏడాది జనవరిలో ఉధృతంగా సాగిన అంగన్‌వాడీల సమ్మెకు నాయకత్వం వహించారు.

వైసిపి ప్రభుత్వ నిర్బంధాన్ని లెక్క చేయకుండా ధైర్యంగా నిలబడ్డారు. గతంలో టిడిపి ప్రభుత్వ నిర్బంధాన్నీ ఇదే విధంగా ఎదుర్కొన్నారు. తులసి మృతి విషయం తెలిసిన వెంటనే అంగన్‌వాడీ కార్యకర్తలు, నాయకులు, ప్రజా సంఘాల నేతలు ఆమె స్వగృహానికి తరలివచ్చి నివాళులర్పించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ విశాఖ కన్వీనర్ పి.మణి, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. తులసి మృతి వారి కుటుంబానికే కాకుండా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు తీరని లోటు అని అన్నారు. ఆమె పోరాట స్ఫూర్తితో అంగన్‌వాడీల హక్కుల కోసం మరింత ఐక్యంగా పోరాడాల్సి ఉందని తెలిపారు. కుటుంబ సభ్యులు మంగళవారం సాయంత్రం అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. తులసి అంతిమయాత్రలో పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'కౌన్సిల్- కమిషన్' వాడటం చట్టవిరుద్ధం : పౌరసరఫరాలశాఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వినియోగదారుల స్వచ్ఛంద సంస్థలు , సంస్థలు తమ సంస్థ పేరులో కౌన్సిల్, కమిషన్ అనే పదాలను ఉపయోగించడం చట్ట విరుద్ధమని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనరు హెచ్ అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. కొందరు ఈ పదాలను ఉపయోగిస్తున్నట్లు రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాలశాఖ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక వేళ ఏదైనా వినియోగదారుల స్వచ్ఛంద సంస్థ " కౌన్సిల్," "కమిషన్' అనే పదాలు ఉపయోగిస్తే అటువంటి సంస్థలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఏదైనా వినియోగదారుల స్వచ్ఛంద సంస్థ తన పేరులో కౌన్సిల్, కమిషన్‌అనే పదాలను కలిగిఉంటే వెంటనే ఆ పదాలను తొలగించాలని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనరు ఆదేశించారు.

మత్స్యకారులకు తక్షణమే వేట నిషేధ భృతి

- ఎపి మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మత్స్యవృత్తి పై ఆధారపడి ఉన్న మత్స్యకార్మికులందరికీ చేపల వేట నిషేధ భృతిని తక్షణమే అందించాలని ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్రంలో మత్స్యసంపదపైనే జీవనాధారం పొందుతున్న మత్స్యకారులు 7.5లక్షల మంది ఉన్నారని, వీరితో పాటు ఐస్‌ప్యాకింగ్, ట్రావెల్, మార్కెటింగ్, డ్రెసింగ్ తదితర పనులు చేసేవారు మరో పది లక్షల మంది పరోక్షంగా జీవనం సాగిస్తున్నారని ఆ సంఘం మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. వీరందరికీ తక్షణమే గుర్తింపుకార్డులు జారీచేయటంతోపాటు చేపల వేట నిషేధ కాలంలో రూ. 20వేల నగదు, రెండు నెలలకు సరిపడ నిత్యవసర వస్తువులు అందించాలని ఆ సంఘం డిమాండ్ చేసింది. రాష్ట్రబడ్జెట్‌లో రూ. 5వేల కోట్లను మత్స్యకారుల సంక్షేమం కోసం కేటాయించాలని, నిషేధ భృతిని సముద్రంపై వేట చేసేవారితోపాటు, ఉప్పుటేర్లు, కాలువలు, చేపలు అమ్మేవారికి, డ్రెస్సింగ్ చేసే వారికీ అమలు చేయాలని మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర కమిటీ కోరింది.

నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నైరుతి బంగాళాఖాతంలో బుధవారం అల్పపీడనం ఏర్పడనుందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఇది ఈశాన్య దిశగా పయనించి శుక్రవారం నాటికి మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించి అక్కడ వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది.

ఈ నెలాఖరుకు తుఫాన్‌గా మారే అవకాశం వుందని వెల్లడించింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర విపత్తుల నిర్వహణా సంస్థ ఎమ్‌డి రోణంకి కుర్మనాథ్ ఒక ప్రకటన విడుదల చేశారు. అల్పపీడనం ఈశాన్య దిశగా కదులుతూ బలపడి నైరుతి బంగాళాఖాతానికి అనుకుని వున్న రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు పొరుగున వున్న తమిళనాడుపై ప్రభావం పడనుంది. దీని ప్రభావంతో ఐదు రోజులపాటు రాష్ట్రంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడనున్నాయని తెలిపారు. అలాగే రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో క్రమంగా ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం కూడా ఉందని పేర్కొన్నారు. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం. సముద్ర మట్టం నుంచి 3.1 కి.మీ ఎత్తు వరకూ ఆవరించింది. ఈ కారణంగా రాష్ట్రంలోని విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామ రాజు జిల్లా, అనకాపల్లి, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో గురువారం పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం వుందని ప్రజలు అప్రమత్తంగా వుండాలని కోరారు. మంగళవారం అనంతపురం జిల్లా నార్పలలో 26.5 మిల్లీ మీటర్లు, బికె సముద్రంలో 22 మిల్లీ మీటర్లు, చిత్తూరులో 22.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తెలిపారు.

23 నుంచి పాలిసెట్ అడ్మిషన్స్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాలిసెట్ 2024 అడ్మిషన్ ప్రక్రియ ఈ నెల 23 నుంచి ప్రారంభమవుతుందని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను బుధవారం విడుదల చేస్తామని పేర్కొన్నారు. పాలిసెట్ ప్రవేశాలకు సంబంధించి విద్యా విషయక సమావేశాన్ని మంగళవారం అమరావతిలోని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ, ప్రవేశాలకు సంబంధించి ఫీజు చెల్లింపు తదితర ఆన్‌లైన్ ప్రక్రియకు ఈ నెల 24 నుంచి జూన్ 2 వరకు పది రోజులపాటు అవకాశం ఉంటుందన్నారు. ధ్రువపత్రాల వెరిఫికేషన్‌కు ఈ నెల 27 నుంచి జూన్ 3 వరకు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఆప్షన్స్ నమోదుకు ఈ నెల 31 నుంచి జూన్ 5 వరకు అవకాశం కల్పించామని ఆమె వివరించారు. జూన్ 5న ఐచ్ఛికాల మార్పునకు అవకాశం ఉంటుందని, జూన్ 7న సీట్ల కేటాయింపును పూర్తి చేస్తామని తెలిపారు. జూన్ 10 నుంచి 14 వరకు ఐదు రోజుల లోపు ప్రవేశాలు ఖరారైన విద్యార్థులు ఆయా పాలిటెక్నిక్‌లలో వ్యక్తిగతంగా, ఆన్‌లైన్ విధానంలో రిపోర్టు చేయాల్సి ఉంటుందని కమిషనర్ నాగరాణి తెలిపారు. పాలిసెట్ పరీక్షకు మొత్తం 1,42,035 మంది హాజరుకాగా, 1,24,430 మంది అర్హత సాధించారన్నారు. సాంకేతిక విద్యాశాఖ సంయుక్త సంచాలకులు వెలగా పద్మారావు, అదనపు కార్యదర్శి ఎస్‌విఆర్‌కె ప్రసాద్, రమణబాబు, చీఫ్ క్యాంప్ ఆఫీసర్ విజయ్‌కుమార్, ఉపసంచాలకులు విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

కుట్రా? ప్రమాదమా?

అమెరికా సామ్రాజ్యవాదాన్ని, ఇజ్రాయిల్ నరమేధాన్ని ఎదిరించి పోరాడుతున్న ఇరాన్‌కు నేతృత్వం వహిస్తున్న ఇబ్రహీం రైసీ హెలికాప్టర్ కూలి మరణించడం దిగ్భ్రాంతికరం. ఆయనతోపాటు విదేశాంగ మంత్రి హుస్సేన్ అమీర్ అబ్దొలాహియన్, తూర్పు అజర్‌బైజాన్ ప్రావిన్సు గవర్నర్, మరో ఐదుగురు అధికారులు ప్రాణాలు కోల్పోయారు. భారీ వర్షాలు, పొగమంచు కారణంగా పర్వత శ్రేణుల్లో ప్రమాదం జరిగిందని పాశ్చాత్య మీడియా చెబుతుండగా, 'సంఘటన'గా ఇరాన్ పేర్కొంది. ప్రమాదమా? కుట్రా? అనే అంశాన్ని నిర్ధారించలేదు. సంఘటనా స్థలంలో విచారణ నిర్వహించడంతోపాటు నిజానిజాలు తేల్చడానికి సైనిక, వైమానిక నిపుణులతో ఉన్నత స్థాయి కమిటీని నియమించింది. అధ్యక్షుడి హెలికాప్టర్‌తోపాటు వెళ్లిన మరో రెండు సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోగా, ఈ హెలికాప్టర్ ఒక్కటే కూలిపోయిన నేపథ్యంలో కుట్రకోణం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

అత్యాధునిక ఆయుధాలతోపాటు సంపదతో అగ్రరాజ్యంగా ఉన్న అమెరికా 'దుష్ట రాజ్యం' అంటూ ఇరాన్‌పై ఆంక్షలు విధించినా.. అదరకుండా, బెదరకుండా సామ్రాజ్యవాదంపై అలుపెరగని పోరాటం చేస్తోంది. వేల సంవత్సరాల చరిత్ర, భారత్‌సహా అనేక ప్రాచీన దేశాలతో వ్యాపార సంబంధాలు ఉన్న ఇరాన్ నాలుగున్నర దశాబ్దాల క్రితం రాజరికానికి ముగింపు పలికింది. ప్రతి నాలుగేళ్లకు ఒకసారి అధ్యక్ష పదవికి, పార్లమెంటుకు ఎన్నికలు జరిగే ఈ దేశంలో షియా చట్టాల ఆధారంగా పాలన సాగుతుంది. మధ్య ప్రాచ్యంలో పట్టు సాధించి, అపార చమురు నిక్షేపాలపై పెత్తనం చేసేందుకు ప్రయత్నిస్తున్న అమెరికాకు ప్రధాన అడ్డంకిగా ఇరాన్ ఉంది. 2021 ఆగస్టులో అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన రైసీ మతపరంగా సాంప్రదాయ వాది అయినా సామ్రాజ్యవాద వ్యతిరేకి. చైనా, రష్యాలతో సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లి, సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులను ఐక్యం చేసేందుకు ప్రయత్నించారు. నూతన టెక్నాలజీని, మందులు, వైద్య పరికరాలను, విమానాలు, హెలికాప్టర్ల విడిభాగాలు సైతం రాకుండా యుఎస్ అడ్డుకుంటోంది. ఆదివారం కూలిన అధ్యక్షుడి బెల్ 212 హెలికాప్టర్ 1979కి ముందు ఇరాన్ చివరి రాజు షా మహ్మద్ రెజా పహ్లావీ హయాంలో సమకూర్చుకున్నది. ఇది కూలిన సంఘటనకు నేరస్తుల్లో అమెరికా ఒకటని ఇరాన్ విదేశాంగశాఖ మాజీ మంత్రి జావెద్ జరీఫ్ తేల్చిచెప్పారు. ఆంక్షల వల్ల, తలెత్తిన నిర్వహణా లోపాల కారణంగా 1979 నుంచి ఇరాన్‌లో జరిగిన ప్రమాదాల్లో పలువురు ప్రముఖులు సహా దాదాపు రెండు వేల మంది ప్రాణాలు కోల్పోయారు.

అనేక దేశాల అధినేతలను హత్య చేసిన చరిత్ర ఉన్న అమెరికా నిఘా సంస్థ సిఐఎది. ఇజ్రాయిల్ నిఘా సంస్థ మొసాద్ పలువురు ఇరాన్ కీలక అధికారులను, నేతలను ఇటీవలి సంవత్సరాల్లో హత్య చేసింది. ఇరాన్ అణు శాస్త్రవేత్తలు, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) కమాండర్ కాసెం సోలిమని హత్య తదితర అనేక దుశ్చర్యలకు ఇవి పాల్పడ్డాయి. సిరియాలోని ఇరాన్ దౌత్య కార్యాలయంపై క్షిపణి దాడి చేసి జనరల్ మహ్మద్ జాహెదీసహా ఏడుగురు సీనియర్ ఐఆర్‌జిసి కమాండర్లను హత్య చేసింది. దీనికి ప్రతిస్పందనగా... అనేక దశాబ్దాల తరువాత ఇజ్రాయిల్‌తో నేరుగా తలపడింది రైసీ నాయకత్వంలోనే. అగ్రరాజ్యాలపై ఒత్తిడి తెచ్చేందుకు, ఇజ్రాయిల్‌కు కళ్లెం వేసేందుకు హమాస్, హౌతీ, హిజ్బుల్లా తదితర సంస్థలకు ఆర్థిక, ఆయుధ చేయూతనందిస్తోంది. రైసీ, అబ్దొల్లాహియన్ మరణించడం దేశీయంగానూ, అంతర్జాతీయంగానూ ఇరాన్‌పై తీవ్ర ప్రభావం చూపనుంది. ప్రస్తుతం దేశ తొలి ఉపాధ్యక్షుడిగా ఉన్న మహమ్మద్ మొఖ్బర్ తాత్కాలిక అధ్యక్షుడిగా నియమితులయ్యారు. అక్కడి రాజ్యాంగం ప్రకారం 50 రోజుల్లో అధ్యక్ష ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. ఇజ్రాయిల్ నరమేధానికి ప్రత్యక్షంగా సహకరిస్తూ... వేల మందిని బలిగొంటున్న అమెరికా... ఈ వ్యక్తి చేతులు రక్తంతో తడిశాయని సంతాప సందేశంలో పేర్కొనడం విడ్డూరం. మోడీ హయాంలో అమెరికా అడుగులకు మడుగులొత్తుతూ.. ఇజ్రాయిల్‌కు వంత పాడుతున్నా... ఇరాన్ మనకు మిత్రదేశంగానే కొనసాగుతోంది. తాజా సంక్షోభాన్ని తట్టుకుని ఇరాన్ మరింత ముందుకు వెళ్లాలని ఆశిద్దాం.

నివాళి



కార్మికోద్యమ నిర్మాత
కామ్రేడ్
పర్సా సత్యనారాయణ
వర్ధంతి నేడు

జననం : 2.6.1924
మరణం : 22.5.2015

సరుకుల దిగుమతులు - ప్రజలపై భారాలు

విశ్లేషణ





వి. రాంభూపాల్

దేశ ఆర్థిక వ్యవస్థ బలాన్ని అంచనా వేయడంలో సరుకుల ఎగుమతులు, దిగుమతులకు చాలా ప్రాధాన్యత వుంటుంది. ఎగుమతులు ఎక్కువగా వుంటే విదేశీ డబ్బు నిల్వలు పెరిగి దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా వుంటుంది. అందుకు విరుద్ధంగా వుంటే విదేశీ కరెన్సీ కొరత ఏర్పడి, తద్వారా మన దేశ రూపాయి విలువ తగ్గి, సరుకుల ధరలు భారీగా పెరిగి ప్రజలపై అదనపు భారాలు పెరుగుతాయి. ఈ పరిస్థితి నుండి ప్రజల దృష్టిని మళ్ళించడానికి పాలకులు మతం, దేశభక్తి, ఉగ్రవాదం లాంటి వాటి గురించి చర్చ లేవదీస్తారు. నేడు దేశంలో జరుగుతున్న ఎన్నికల్లో బిజెపి మతం, చొరబాటుదార్లు, మంగళసూత్రాలు, శ్రీరాముడు అంటుంటే ప్రజలు మాత్రం సరుకుల ధరలు, నిరుద్యోగం, పేదరికం అంటున్నారు. అందుకే ఎన్నికలు జరుగుతున్న ప్రతి దశలో మోడీ మాటలు మారుస్తూ ఊసరవెల్లితో పోటీ పడుతున్నారు.

ఏప్రిల్‌లో ఎగుమతులు 1.07 శాతం మాత్రమే పెరిగితే, దిగుమతులు మాత్రం 10.25 శాతం పెరిగాయి. దీనివల్ల వాణిజ్య లోటు 19.1 బిలియన్ డాలర్లకు చేరింది. ఈ లోటును భర్తీ చేయడానికి విదేశాలు, లేదా ప్రపంచ ఆర్థిక సంస్థల నుండి అప్పులు చేయాల్సి వస్తుంది. ఆ సంస్థలు విధించే షరతులను పాలకులు అంగీకరించి దేశ ప్రజలను బలి పెడుతున్నారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలకు కోత కోయడం, ఉపాధి అవకాశాలను తగ్గించడం, ధరలను పెంచడం లాంటి చర్యలు దేశ ఆర్థిక వ్యవస్థను మరింతగా దిగజారుస్తాయి. ఈ విషవలయం నుండి బయటపడాలంటే స్వదేశీ ఉత్పత్తులు పెరగాలి. ఎగుమతులూ పెరగాలి. అందుకు సరైన ప్రణాళిక మోడీ ప్రభుత్వానికి లేదు.

గత సంవత్సరం ఏప్రిల్ నెలలో మన దేశం నుండి విదేశాలకు 34.62 బిలియన్ డాలర్ల విలువైన సరుకులు ఎగుమతి కాగా, 49.06 బి.డాలర్ల విలువైన దిగుమతులు జరిగాయి. ఈ సంవత్సరం అదే ఏప్రిల్ నెలలో 34.99 బిలయన్ డాలర్ల ఎగుమతులు కాగా, 54.09 బిలియన్ డాలర్ల సరుకులు దిగుమతి అయ్యాయి. మనం విదేశాల నుండి దిగుమతి చేసుకున్న సరుకులకు అమెరికన్ డాలర్లలో లేదా ఇతర దేశాల కరెన్సీలో చెల్లింపులు చేయాలి. ఆ డబ్బు మన దగ్గర వుండాలంటే ఎగుమతులు పెరగాలి. కానీ దిగుమతులు పెరిగినంతగా ఎగుమతులు పెరగకపోతే విదేశీ మారక ద్రవ్య లోటు ఏర్పడుతుంది. నేడు దేశంలో అమలవుతున్న వినాశకర ప్రపంచీకరణ విధానాలకు మూలం ఈ లోటే. సరళీకరణ విధానాలు అమలు చేస్తే దేశంలో విదేశీ కరెన్సీ కుప్పలు కుప్పలుగా వచ్చి చేరుతుందని చెప్పిన పండితులు, పాలకులు నేడు మౌనంగా వున్నారు. దిగుమతులు పెరగడం వల్ల గత సంవత్సరం వాణిజ్య లోటు 14.44 బిలియన్ డాలర్లు వుంటే, ఈ సంవత్సరం 19.1 బిలియన్ డాలర్లు అంటే 32.3 శాతం లోటు ఏర్పడినట్లు వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. దిగుమతుల్లో అత్యంత ఖరీదైన బంగారం దిగుమతులది అగ్ర స్థానం. గత సంవత్సరం 1.01 నుండి 3.11 బిలియన్ డాలర్లకు బంగారం దిగుమతులు పెరిగాయి. దేశంలో పెరుగుతున్న సంపన్నులు, నయా ధనిక వర్గాలు తమ ఆభరణాలకు చేస్తున్న ఖర్చు పెరిగిపోతుందని అందువల్ల విదేశాల నుండి బంగారం దిగుమతులు పెరిగిపోతున్నాయని ఈ ధోరణిని నివారించకపోతే దేశం మరింతగా అప్పుల్లో కూరుకు పోతుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నా మోడీ ప్రభుత్వానికి చెవికెక్కడం లేదు. బంగారంతో పాటు చమురు దిగుమతులు పెరుగుతున్నాయి. అలాగే మరో 14 రకాల సరుకుల దిగుమతులు ఈ ఏప్రిల్ నెలలో పెరిగాయి. పప్పులు 172.3 శాతం, పండ్లు, కూరగాయలు 27.7 శాతం, మందులు, ఔషధాలు 18.4 శాతం, ఎలక్ట్రానిక్ పరికరాలు 10 శాతం పెరిగాయి. మరోవైపు మన దేశం నుండి విదేశాలకు ఎగుమతులు భారీగా తగ్గిపోయాయి. ముఖ్యంగా ఇంజనీరింగ్ వస్తువులు 3.2 శాతం, తోలు 7.2 శాతం, నూలు 7.2 శాతం, బియ్యం 4.8 శాతం, పండ్లు, కూరగాయలు 6.8 శాతం తగ్గాయి. సముద్ర ఉత్పత్తులు గణనీయంగా 13 శాతం తగ్గాయి. మోడీ ఎంతో ఆర్భాటంగా ఇచ్చిన మేక్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ ఇండియా నినాదాలు గడప దాటలేదని దీనివల్ల స్పష్టంగా అర్థమవుతుంది. మన రూపాయి విలువ ఇప్పటికే బలహీనపడింది. ఇదే పరిస్థితి కొనసాగితే ఒక డాలర్‌కు 84 రూపాయల స్థాయికి త్వరలో చేరుకుంటుంది. దీనివల్ల విదేశీ అప్పులు పెరగడంతో పాటు, దేశంలో సరుకుల ధరలు ఆకాశాన్నంటుతాయి.

రోజురోజుకీ నిత్యావసర వస్తువుల ధరలు హద్దు అదుపు లేకుండా ఆకాశాన్నంటుతున్నాయి. ఒక్క శాతం ఆహార సరుకుల ధరలు పెరిగితే ప్రపంచంలో కోటి మంది దుర్భర దారిద్ర్యంలోకి నెట్టబడతారని ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు చెప్పాడు. కాయగూరలు, పప్పుల ధరలు 45 శాతం పైగా పెరిగాయి. కందిపప్పు, మినపప్పు, వేరుశనగ, వంటనూనె ధరలు ఒక్క నెలలోనే 22 శాతం పెరిగాయి. కూరగాయలు, పప్పులు, తృణధాన్యాల వంటి కీలకమైన సరుకుల ధరల పెరుగుదల వల్ల మన దేశ రిటైల్ ద్రవ్యోల్బణం గత జులైలో గత 15 నెలల గరిష్ట స్థాయికి 7.44 శాతానికి చేరుకుంది. ఈ లెక్కన దేశంలో ఎన్ని కోట్ల మంది దుర్భర దారిద్ర్యంలోకి నెట్టబడతారో ఊహించడానికే భయంకరంగా వుంటుంది. ఉల్లిపాయలు, టమోటాలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు దివాళా తీస్తుంటే, పెరిగిన ధరల భారాన్ని మోయలేక వినియోగదారులు కునారిల్లుతున్నారు. ద్రవ్యోల్బణం కారణంగా మోడీ అధికారం చేపట్టిన నాటి నుండి ఇప్పటి వరకు నిత్యావసర వస్తువుల ధరలు దాదాపు 300 శాతం వరకు పెరిగాయి. డీజల్‌పై 512 శాతం, పెట్రోలుపై 194 శాతం ఎక్సైజ్ పన్ను పెంచారు. వంటగ్యాస్ 185 శాతం పెరిగింది. వీటివల్ల అన్ని రకాల సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.

పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు ఏనాడూ పెరిగే పరిస్థితి వుండదు. దీనివల్ల ప్రజల కొనుగోలు శక్తి పడిపోతుంది. ఇది రెండు సమస్యలకు కారణం అవుతుంది. ఒకవైపు ప్రజల కొనుగోలు తగ్గి, ఉత్పత్తి తగ్గిపోతుంది. మార్కెట్‌లో ఉన్న సరుకులు కూడా అమ్ముడుపోని పరిస్థితి ఏర్పడుతుంది. ఉత్పత్తి తగ్గడంతో కార్మికులను పని నుండి తొలగిస్తారు. అది ఉపాధి కోల్పోవడానికి కారణమవుతుంది. నిరుద్యోగ సమస్యను మరింత పెంచుతుంది. అందుకే దేశంలో గత 40 సంవత్సరాల్లో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగ రేటు పెరిగిపోయింది. ఉత్పత్తి రంగంలో కార్మికుల భాగస్వామ్యం 42.9 నుండి 39.8 శాతానికి పడిపోయింది. 2020లో 41.1 కోట్లుగా ఉన్న ఉద్యోగుల సంఖ్య 2023లో 40.9 కోట్లకు తగ్గింది. ప్రతి సంవత్సరం రెండు కోట్ల కొత్త ఉద్యోగాలు రావడం కాదు, ఉన్న ఉద్యోగాలే కోటికి పైగా తగ్గాయి. మరోవైపు సరిపడా ఆదాయం లేకపోవడంతో పెరిగిన సరుకులను కొనలేక అర్థాకలితో, పోషకాలు లేని ఆహారంతో కడుపులు నింపుకోవాల్సి వస్తుంది. పౌష్టికాహార లోపం తద్వారా రోగాలు, రొప్పులు ప్రజలను ముట్టడిస్తున్నాయి. ఇదంతా ఒక విష వలయం. 6 నుండి 23 సంవత్సరాల లోపు వయసున్న పిల్లల్లో కేవలం 10 శాతానికి మాత్రమే తగినన్ని పోషక విలువలు కలిగిన ఆహారం లభిస్తుందని కేంద్ర ప్రభుత్వ జాతీయ కుంటుంబ ఆరోగ్య సర్వే చెబుతోంది. 5 సంవత్సరాల లోపు పిల్లల్లో 35.8 శాతం మంది తక్కువ బరువుతో ఉన్నారు. ప్రపంచ ఆకలి సూచీ-2022 ప్రకారం మన దేశ ర్యాంకు గతంలో వున్న 107 నుండి 121కి దిగజారింది. 22 కోట్ల మంది తీవ్రమైన ఆకలిని ఎదుర్కొంటుంటే, 62 కోట్ల మందికి సరైన ఆహారం అందడంలేదు.

> దేశీయ చిన్న, మధ్య తరహా పరిశ్రమలను దివాళా తీయించి విదేశీ, స్వదేశీ కార్పొరేట్ సరుకులను మార్కెట్ల నిండా ముంచివేయడం నేటి బిజెపి విధానంగా మారింది. దేశంలో అత్యధిక మంది ఆధారపడిన వ్యవసాయ రంగం పరిస్థితి దినదిన గండం నూరేళ్ళ ఆయుష్షుగా మారింది. పెట్టుబడి ఖర్చులు పెరగడంతో పాటు గిట్టుబాటు ధరలు అందకపోవడంతో మోడీ దశాబ్దాల పాలనలో 15 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ దుర్భర పరిస్థితుల నుండి రైతులను ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ వ్యవసాయాన్ని అమలు చేసేందుకు చట్టాలను మారుస్తున్నారు. వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తులు పెరగకుండా దేశాభివృద్ధి జరగదు. పాలకుల మాటల గారడీల వల్ల కొంత కాలం ఓట్లు రాలతాయేమో కానీ ప్రజల జీవితాలను మార్చవు. జీవిత సత్యాలను గుర్తించిన ప్రజలే పాలకులను, వారి విధానాలను తప్పక మారుస్తారు. అందుకు నేడు దేశంలో జరుగుతున్న ఎన్నికల్లో ప్రతి దశలో మోడీ విన్యాసాలే సజీవ సాక్ష్యాలు.

గతంలో ఆర్‌ఎస్‌ఎస్‌కు అనుబంధంగా స్వదేశీ జాగరణ్ మంచ్ అనే సంస్థ దేశీయ వస్తువులను వాడి దేశభక్తిని చాటండని ప్రచారం చేసేది. ఈ ప్రచారం వెనుక వారి అసలు ఎజెండా వేరే అయినప్పటికీ స్వదేశీ వస్తువుల గురించి చెప్పేవారు. మోడీ పాలనలో ఈ సంస్థ అడ్రసే లేకుండా పోయింది. దేశీయ చిన్న, మధ్య తరహా పరిశ్రమలను దివాళా తీయించి విదేశీ, స్వదేశీ కార్పొరేట్ సరుకులను మార్కెట్ల నిండా ముంచివేయడం నేటి బిజెపి విధానంగా మారింది. దేశంలో అత్యధిక మంది ఆధారపడిన వ్యవసాయ రంగం పరిస్థితి దినదిన గండం నూరేళ్ళ ఆయుష్షుగా మారింది. పెట్టుబడి ఖర్చులు పెరగడంతో పాటు గిట్టుబాటు ధరలు అందకపోవడంతో మోడీ దశాబ్దాల పాలనలో 15 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు.

ఈ దుర్భర పరిస్థితుల నుండి రైతులను ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ వ్యవసాయాన్ని అమలు చేసేందుకు చట్టాలను మారుస్తున్నారు. వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తులు పెరగకుండా దేశాభివృద్ధి జరగదు. పాలకుల మాటల గారడీల వల్ల కొంత కాలం ఓట్లు రాలతాయేమో కానీ ప్రజల జీవితాలను మార్చవు. జీవిత సత్యాలను గుర్తించిన ప్రజలే పాలకులను, వారి విధానాలను తప్పక మారుస్తారు. అందుకు నేడు దేశంలో జరుగుతున్న ఎన్నికల్లో ప్రతి దశలో మోడీ విన్యాసాలే సజీవ సాక్ష్యాలు.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

'న.మో'ని హిట్లర్, గోబెల్స్ ఆవహించారా!

వ్యాఖ్య

సత్య

> నరేంద్ర మోడీ ఇన్ని పచ్చి అబద్ధాలను ప్రచారం చేయటం వెనుక ఉన్న మతలబు ఏమిటి? పలుకుబడి దిగజారుతున్న పూర్వ రంగంలో ఒక్క మైనారిటీ విద్వేషంతోనే లాభం లేదని గ్రహించి కాబోలు ముందే చెప్పుకున్నట్లు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రామాలయాన్ని బుల్డోజర్లతో కూల్చివేస్తారంటూ హిందువులను రెచ్చగొట్టి లబ్ధి పొందాలన్నది స్పష్టంగా కనిపిస్తున్నది. నిజానికి మసీదులు, చర్చిలను కూల్చివేసిన చరిత్ర కాషాయ దళాలది తప్ప ఇతర పార్టీలది కాదు. రోడ్ల విస్తరణ పేరుతో నరేంద్ర మోడీ సి.ఎంగా ఉండగా అహమ్మదాబాద్‌లో కొన్ని మందిరాలను కూడా తొలగించారన్న వార్తలు తెలిసిందే.

ప్రధాని నరేంద్ర మోడీ, ఇతర సంఘ పరివార్ నేతలను హిట్లర్, గోబెల్స్ ఆవహించినట్లు కనిపిస్తోంది. లేకుంటే ఉత్తర ప్రదేశ్‌లో సమాజ్‌వాది పార్టీ-కాంగ్రెస్‌కు ఓటు వేస్తే వారు అయోధ్య రామాలయాన్ని బుల్డోజర్లతో కూల్చివేస్తారని, బాలరాముడిని తిరిగి గుడారాల్లో కూర్చో పెడతారని నరేంద్ర మోడీ చెప్పేవారు కాదేమో! ఇంతకీ ఆయన ఎందుకిలా మాట్లాడినట్లు ?

వాట్సాప్‌లో తిరుగుతున్న ఒక కథనంలో రచయిత ఎవరో తెలియదు గానీ నరేంద్ర మోడీ-హిట్లర్ మధ్య ఒక పోలిక తెచ్చారు. ఒక మతం వారు దేశానికి వ్యతిరేకులనే భావాన్ని హిట్లర్ తలకు ఎక్కించుకున్నాడు. హిట్లర్‌ను ఎవరైనా విమర్శిస్తే మద్దతుదార్లు సహించేవారు కాదు. అన్ని రకాల మీడియాను తన గురించి గొప్పలు చెప్పుకోవటానికి హిట్లర్ ఉపయోగించుకున్నాడు. తన వ్యతిరేకులందరినీ అణచివేశాడు. వారు దేశ ద్రోహులని, జాతి వ్యతిరేకులని ఎల్లవేళలా పిలిచాడు. అన్ని సమస్యలనూ స్వల్ప కాలంలోనే పరిష్కరిస్తానని వాగ్దానం చేశాడు. మంచి రోజులు రానున్నాయన్నది హిట్లర్ నినాదం. మంచి దుస్తులు వేసుకొని అందంగా కనిపించేందుకు హిట్లర్ చూసేవాడు. అబద్దాలను నిజాలుగా భ్రమింపచేసే కళను హిట్లర్ ప్రదర్శించేవాడు. రేడియోలో ఉపన్యాసాలు ఇచ్చేందుకు హిట్లర్ ఇష్టపడేవాడు. స్నేహితులు, సోదరులు, సోదరీమణులంటూ తన ప్రతి ప్రసంగంలో హిట్లర్ మాట్లాడేవాడు. హిట్లర్‌కు ఫొటోలు తీయించుకోవటమంటే పిచ్చి. పైన పేర్కొన్న వాటిలో నరేంద్ర మోడీకి ఏ లక్షణాలు ఉన్నాయో లేవో ఎవరికి వారు బేరీజు వేసుకోవచ్చు.

2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటి వరకు జరిగిన లేదా జరిపిన ప్రచారంలో 'ఇండియా' వేదిక బిజెపి విధానాలపై విమర్శలతో పాటు...ఆ వేదిక లోని పార్టీలు విడివిడిగా ప్రకటించిన మ్యానిఫెస్టో లోని అంశాలను, బిజెపి చెబుతున్నట్లుగా నాలుగు వందల సీట్లు ఎందుకు కోరుతున్నదో, ఏం చేసేందుకు అన్ని సీట్లు కోరుతున్నదో స్పష్టంగానే ప్రచారం చేశాయి. బిజెపి వస్తే రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను ఎత్తివేస్తుందన్నది ప్రధానమైన విమర్శ. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బిజెపి ఎంతసేపూ ఎన్ని మరుగుదొడ్లు కట్టించిందీ, ఎన్ని ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఇచ్చిందీ, రోడ్లు వేసిందీ చెప్పుకోవటం తప్ప జన జీవితాలను మెరుగు పరిచేందుకు చేసిందేమిటో పెద్దగా చెప్పలేదు. పచ్చి అవాస్తవాలను, ఆధారం లేని ఆరోపణలను ఎన్నింటినో స్వయంగా నరేంద్ర మోడీ ప్రచారం చేస్తున్నారు. ప్రపంచ చరిత్రలో ఇంతగా వక్రీకరణ, అవాస్తవాలు, అభూత కల్పనలు ప్రచారం చేసిన ప్రభుత్వ నేత మరొకరు లేరన్నది వేరే చెప్పనవసరం లేదు. మీడియాలో ఎన్ని టీవీ ఛానళ్లు వాటి గురించి చర్చలు పెట్టాయి, ఎన్ని పత్రికలు ప్రముఖంగా విశ్లేషణలు, వాస్తవాలను వెల్లడించాయి? ఇదేం ప్రచారం అన్నట్లుగా కొందరు గొణిగినట్లు విమర్శించటం తప్ప గట్టిగా బట్టబయలు చేసే ధైర్యం చేయటం లేదు. విదేశీ మీడియాలో కూడా ఇదే వ్యక్తమైంది.

నరేంద్ర మోడీ ఇన్ని పచ్చి అబద్దాలను ప్రచారం చేయటం వెనుక ఉన్న మతలబు ఏమిటి? పలుకుబడి దిగజారుతున్న పూర్వ రంగంలో ఒక్క మైనారిటీ విద్వేషంతోనే లాభం లేదని గ్రహించి కాబోలు ముందే చెప్పుకున్నట్లు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రామాలయాన్ని బుల్డోజర్లతో కూల్చివేస్తారంటూ హిందువులను రెచ్చగొట్టి లబ్ధి పొందాలన్నది స్పష్టంగా కనిపిస్తున్నది. నిజానికి మసీదులు, చర్చిలను కూల్చివేసిన చరిత్ర కాషాయ దళాలది తప్ప ఇతర పార్టీలది కాదు. రోడ్ల విస్తరణ పేరుతో నరేంద్ర మోడీ సిఎంగా ఉండగా అహమ్మదాబాద్‌లో కొన్ని మందిరాలను కూడా తొలగించారన్న వార్తలు తెలిసిందే.

కొందరు పనిగట్టుకొని పదే పదే తప్పుడు సమాచారాన్ని మెదళ్లలోకి ఎక్కిస్తే జనం ఎందుకు నమ్ముతున్నారనేది ప్రశ్న. దీని గురించి భిన్న కోణాలు వెలువడుతున్నాయి. తమ ముందుకు వచ్చిన ఒక సమాచారం వాస్తవం కాదని తెలిసినప్పటికీ అది పదే పదే వేర్వేరు మార్గాల్లో చేరితే 'ఏమో నిజమేనేమో...!' అనే సందేహంలో పడతారు. బ్రాహ్మణుడు-మేకపిల్ల కథ తెలిసిందే. దానికి ప్రతిగా సమాచారం లేకపోతే చివరికి నిజమని నమ్ముతారు. ఉదాహరణకు వైరస్‌తో జలుబు చేస్తుంది. నిజానికి దానికి మందు లేదు. ఎందుకంటే ఎప్పటికప్పుడు మారే వైరస్‌కు వెంటనే మందు కనుగొనటం సాధ్యం కాదు. ఏదైనా బిళ్ల వాడితే వారంలో వాడకపోతే ఏడు రోజుల్లో జలుబు తగ్గుతుందన్న లోకోక్తి తెలిసిందే. మన శరీరంలోని రోగ నిరోధకశక్తి ఆ వైరస్‌ను ఎదుర్కొన్న తరువాత అదే తగ్గిపోతుంది. కానీ అనేక మంది ఫలానా బిళ్ల వేసుకుంటే మాకు తగ్గింది అని చెప్పారనుకోండి, కొంతకాలానికి మిగతావారు పోయేదేముంది మనమూ చూద్దాం అని ఆ బిళ్లలనే వాడతారు. మరో ఉదాహరణ చెప్పుకుందాం. పొట్టను తగ్గించాలంటే సూక్ష్మంలో మోక్షంలా ఫలానా మిషన్ వాడితే తగ్గిపోతుందనే ప్రచారం తెలిసిందే. ఒకసారి చూద్దాం పోయేదేముంది అనుకొని అనేక మంది కొనుగోలు చేయటం, ఆయిల్ పుల్లింగ్, మంచి నీటి వైద్యాల వంటి వాటికి బుర్రలను అప్పగించటం చాలా మందికి తెలిసిందే. ఇలాంటి వాటి వలన వ్యక్తులు నష్టపోతారు. అదే ఒక ప్రతికూల భావజాలానికి చెవి అప్పగిస్తే యావత్ సమాజానికే ప్రమాదకరం. ప్రతి మనిషి సగటున రోజుకు 35 వేల నిర్ణయాలు తీసుకుంటున్నట్లు కొందరు పరిశోధకులు చెప్పారు. ఒక షర్టు ఆరటానికి అర్ధగంట పడితే పది షర్టులు ఎంతసేపటిలో ఆరతాయంటే ఐదు గంటలు అనేవారు, ఒక కిలో దూది బరువా ఒక కిలో ఇనుము బరువా అంటే ఇనుము అని చెప్పేవారి గురించి తెలిసిందే. అంటే ప్రతి క్షణానికి మన మెదళ్లకు ఎంతో సమాచారం అందుతుంటుంది. బహుశా ఈ కారణంగానే వెంటనే బుర్రకు తర్కం కూడా తట్టదు. మన బుర్రలో రెండు రకాల ఆలోచనా వ్యవస్థలుంటాయట. ఒకటి అదుపులేని స్పృహతో తక్షణమే స్పందించేది, రెండవది స్పృహతో దీర్ఘంగా, లోతుగా ఆలోచించి నిర్ణయించేది. జనాలు మొదటిదానికే ఎక్కువగా పనిపెడతారని, అందువలన లోతుగా ఆలోచించకుండా చేసే పద్ధతులు, సమాచారాన్ని కొన్ని శక్తులు మన బుర్రలకు చేరవేస్తాయని భావిస్తున్నందున హిట్లర్ వంటి నియంతలు, మార్కెటింగ్ నిపుణులు, రంగులు మార్చే రాజకీయవేత్తలు ప్రతి తరాన్ని ఏదో విధంగా మభ్యపెట్టగలుగుతూనే ఉన్నారు.

అఫ్‌కోర్స్! పెరుగుట విరుగుట కొరకే. హిట్లర్‌ను ఆరాధించిన జర్మన్లే ఇప్పుడు ఆ పేరు ఎత్తటానికి కూడా ఇచ్చగించరు. 'వాడొక కుక్క' అంటారు. ఎవరికైనా అదే గతి.



అభిప్రాయం

వైద్యమూ వాణిజ్యమూ

వైద్య సేవల్ని వినియోగదారుల రక్షణ చట్టం పరిధిలోకి తీసుకువచ్చిన 1995 సంవత్సరపు తీర్పుపై పునరాలోచించాలని సుప్రీంకోర్టు అభిప్రాయపడడం ఒక మంచి పరిణామం. ఇప్పటికే న్యాయ సేవల్ని ఈ చట్టం పరిధి నుండి మినహాయిస్తూ అత్యున్నత న్యాయస్థానం తీర్పు చెప్పింది. వైద్యం, వ్యాపార గుణాన్ని సంతరించుకోవడం నేటి నిజం. అలాగని ఆ పవిత్ర వృత్తిని పూర్తిగా వ్యాపారంగా లెక్క కట్టడం తప్పు. అలా చెయ్యడం వల్ల అంతిమంగా ప్రజలకు జరిగే నష్టమే ఎక్కువ. వైద్యుడికీ, రోగికీ ఉన్న సంబంధం, ఉండాల్సిన సంబంధం అమ్మకందారుకీ, కొనుగోలుదారుకీ ఉన్న సంబంధం కాదు. దాన్ని కేవలం లాభనష్టాల కోణంలో నిర్వచించలేం. అది నమ్మకంతో, గౌరవంతో ముడిపడి ఉంటుంది. వినియోగదారుల రక్షణ చట్టం పరిధిలోకి వైద్య సేవల్ని తీసుకురావడం వల్ల ఆ సేవలు ఖరీదుగా మారాయి. తన విజ్ఞానం, నైపుణ్యం స్వేచ్ఛగా వాడి, రోగ నిర్ధారణ, చికిత్స అందించాల్సిన వైద్యుడు, కొంత భయంతో రక్షణాత్మక వైఖరి తీసుకోవడం వల్ల అవసరానికి మించి వైద్య పరీక్షలు చేయించాల్సి వస్తుంది. సత్వర వైద్యం సరియైనది అనుకున్నది అందించడం కన్నా, తన వాదనకు మద్దతుగా మరిన్ని సాక్ష్యాలకై వెదుకులాడవలసి వస్తున్నది. ఉదాహరణకు వైరల్ జ్వరాల సీజన్‌లో ఒక రోగికి వచ్చిన జ్వరం వైరల్ జ్వరమే అని తన అనుభవం, జ్ఞానం, డయాగ్నొస్టిక్ నైపుణ్యం చెప్తున్నా, దాని నిరూపణకై ఎక్కువ టెస్టులు రాయాల్సిన అగత్యం ఏర్పడుతుంది. రోగి ఖర్చు తడిసి మోపెడవుతుంది. ఇది ఒక కోణం. ఇంకో కోణం ఏమిటంటే రోగనిదానం పూర్తిగా వైద్యుని చేతిలో ఉండదు. ఎంత ఉత్తమ సేవలందించినా కొన్ని వేళల తన చెయ్యి దాటే పరిస్థితి. అలాంటి స్థితిలో తాను మళ్ళీ ఎలాంటి ఉదాసీనత చూపలేదని నిరూపించుకోవాల్సి రావడం వైద్యునికి మరో పెద్ద సవాల్. ఇవన్నీ నాకెందుకు అనుకుని వైద్యుడు 'చికిత్స అందించడం నా వల్ల కాదు, మరో చోటికి తీసుకుపొండి' అంటూ తిరస్కరించవచ్చు. ఆ విధంగా కూడా సమయానికి వైద్యం అందక రోగికి నష్టమే. ఎలాగూ వైద్య సేవల్లో నిర్లక్ష్యాన్ని సహించని రీతిలో చట్టాలున్నాయి. వాటిని వినియోగించుకోవచ్చు. వాటితో పాటు వైద్య సేవల్ని వినియోగ దారుల సేవలుగా భావిస్తే వైద్యులపై, సమాజంపై అదనపు భారం. న్యాయ సేవల లాగానే వైద్య సేవల్ని కూడా ఈ చట్టం నుండి మినహాయించడం మంచిది. దీనితో బాటు వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆసుపత్రులపై దాడుల్ని కూడా ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలి. నివారించాలి. జరిగినప్పుడు కఠిన చర్యలు తీసుకోవాలి. మరోవైపు వైద్యులు కూడా వైద్యం వాణిజ్య రూపం సంతరించుకోకుండా తమ శక్తి మేరకు కృషి చెయ్యాలి. రోగిని కేసులా, కస్టమర్లా కాకుండా మిత్రునిలా చూడాలి. రోగ నిదానం, చికిత్స, అవకాశాలు అన్నీ సహానుభూతితో అతనితో చర్చించాలి. పరస్పర నమ్మకమే ఆరోగ్య సేవలకు పునాది. సమాజానికి ఆరోగ్యకరం.

- డా.డి.వి.జి. శంకరరావు,
మాజీ ఎంపీ, విజయనగరం.

పెరుగుతున్న ధరలు

ఇప్పటికే పెరుగుతున్న ఎండలకు తోడు నిత్యవసర వస్తువుల ధరలు అధికంగా పెరిగాయి. దీంతో సామాన్య ప్రజలు అల్లాడిపోతున్నారు. రాబోయే రోజుల్లో పలు వస్తువుల ధరలు పెరగబోతున్నాయన్న ఆర్థిక నిపుణుల సూచనలు సామాన్యుల్లో దడ పుట్టిస్తున్నాయి. నిత్యవసర వస్తువులు ధరలు రోజురోజుకూ పెరిగిపోవటంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలపై ఆర్థిక భారం పడుతుంది. ధరలు నియంత్రించడం కోసం జిల్లాల వారీగా ధరల పర్యవేక్షణ కమిటీ ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. బయటి మార్కెట్లో బియ్యం, అనేక రకాల పప్పులు, కూరగాయలు తదితర వస్తువులు ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. కూలి నాలి చేసుకునే కుటుంబాలు ధరల మంటలు తట్టుకోలేక సతమతం అవుతున్నాయి. ఉప్పు నుంచి పప్పులు దాకా...నూనె నుంచి కూరగాయల వరకు ఏది కొనాలన్నా ప్రజలకు గుదిబండ లాగా మారిపోయాయి. ప్రభుత్వాలు ఇప్పటికైనా వీటిపై శ్రద్ధ వహించి ధరలను అదుపు చేయాలి.

- ఉప్పలపు శేషునాథ్,
పి. నైనవరం గ్రామం, ఎన్టీఆర్ జిల్లా.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

గతం కంటే తగ్గిన పోలింగ్

- నాలుగు దశల్లో ఇదే పరిస్థితి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఐదు దశల పోలింగ్ ముగిసింది. ఇంకా రెండు దశల పోలింగ్ మిగిలింది. అయితే ముగిసిన ఐదు దశల పోలింగ్, గత 2019 లోక్‌సభ ఎన్నికల కంటే తక్కువగానే నమోదయింది. ఈ ఏడాది తొలి దశలో 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 102 స్థానాలకు పోలింగ్ జరిగింది. 2019లో ఈ 102 స్థానాల్లో 69.96 శాతం ఓట్లు పోలవ్వగా, ఈసారి 66.14 శాతం ఓటింగ్ నమోదైంది. అంటే గతసారి కంటే ఇప్పుడు 3.82 శాతం ఓటింగ్ తగ్గింది. రెండో దశలో 13 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 88 స్థానాలకు ఓటింగ్ జరిగింది. గత ఎన్నికల్లో ఈ 88 స్థానాల్లో మొత్తం 70.09 శాతం ఓటింగ్ నమోదుకాగా, ఈసారి 66.71 శాతం ఓటింగ్ నమోదయింది. అంటే గతసారి కంటే ఇప్పుడు 3.38 శాతం ఓటింగ్ తగ్గింది.

మూడో దశలో 11 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 93 స్థానాలకు పోలింగ్ జరిగింది. 2019లో ఈ 93 సీట్లలో మొత్తం 66.89 శాతం పోలింగ్ జరగగా, ఈసారి 65.68 శాతం ఓటింగ్ జరిగింది. అంటే గతసారి కంటే ఇప్పుడు 1.21 శాతం ఓటింగ్ తగ్గింది. నాలుగో దశలో 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 96 స్థానాలకు ఓటింగ్ జరిగింది. 2019లో మొత్తం 69.12 శాతం ఓటింగ్ నమోదు కాగా, ఈసారి 69.16 శాతం ఓటింగ్ జరిగింది. అంటే, గతం కంటే 0.04 శాతం పెరిగింది. ఇక ఈ నెల 20న జరిగిన ఐదో దశలో రాత్రి 11:30 గంటల సమయానికి 60.09 ఓటింగ్ జరిగింది. 2019లో ఈ స్థానాల్లో మొత్తం 62.01 శాతం ఓటింగ్ నమోదైంది. అంటే 1.92 శాతం తగ్గింది.

హేమంత్ సోరెన్ బెయిల్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ బెయిల్ పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. మంగళవారం జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన వెకేషన్ బెంచ్ ఈ పిటీషన్‌ను విచారించింది. తదుపరి వాదనలను బుధవారానికి వాయిదా వేసింది. హేమంత్ సోరెన్‌ను మనీలాండరింగ్ కేసులో అరెస్టు చేయడాన్ని సవాల్ ట్రయల్ కోర్టు, హైకోర్టు ఇప్పటికే ఆమోదించిన విషయాన్ని ధర్మాసనం గుర్తు చేసింది. దీనికి హేమంత్ సోరెన్ తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ స్పందిస్తూ సోరెన్ తన అరెస్టును చట్టవిరుద్ధమని సవాల్ చేస్తున్నారని, బెయిల్, కేసు రద్దు కోరడం లేదని అన్నారు.

గాల్లో కల్లోలం

- విమానంలో తీవ్ర కుదుపులు
- ఒకరి మృతి
- 30 మందికి గాయాలు

బ్యాంకాక్ : గాల్లో విమానం ప్రయాణిస్తున్న సమయంలో కల్లోలం తలెత్తింది. భారీ కుదుపులతో విమానంలో ఉన్న ప్రయాణికులు విలవిల్లాడిపోయారు. ఒకరు చనిపోవడంతో పాటు 30 మంది పైగా గాయపడ్డారు. చాలా అరుదుగా సంభవించే ఈ ఘటన సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఎస్‌క్యు 321 అనే విమానంలో మంగళవారం చోటుచేసుకుంది. విమానయాన సంస్థ తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 20న మొత్తం 211 మంది ప్రయాణికులు, 18 మంది సిబ్బందితో ఎస్‌క్యు 321 అనే విమానం లండన్ నుంచి సింగపూర్‌కు బయల్దేరింది. మార్గమధ్యలో విమానం తీవ్ర కుదుపులకు లోనుకావడంతో దానిని థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లోని సువర్ణభూమి విమానాశ్రయానికి అత్యవసరంగా మళ్లించారు. ఈ ఘటనలో ఒకరు మరణించారని, కొందరు గాయపడ్డారని ఆ సంస్థ వెల్లడించింది. అయితే 30 మంది పైగా గాయపడినట్లు వివిధ వార్తా సంస్థలు వెల్లడించాయి. విమానం తీవ్ర కుదుపునకు లోనైన ఘటనలో మరణించిన వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు సింగపూర్ ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. ప్రయాణికులకు అవసరమైన వైద్య సాయం అందించేందుకు స్థానిక అధికారులతో కలిసి పనిచేస్తున్నట్లు వెల్లడించింది. పరిస్థితిని పర్యవేక్షించేందుకు ఓ బందాన్ని బ్యాంకాక్‌కు పంపుతున్నట్లు తెలిపింది. ప్రయాణికులు విమానంలో సీటు బెల్టులు ధరించకపోతే..వారంతా క్యాబిన్ వైపు ముందుకు జరిగిపోతారని అలాంటి సందర్భాల్లో ఇలాంటి కుదుపులు చోటుచేసుకునేవీలుందని విమానయాన రంగ నిపుణులు తెలిపారు. అయితే సింగపూర్ ఎయిర్‌లైన్స్ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సివుంది.

విమానం ఢీకొని ఫ్లెమింగో పక్షుల మృతి

ముంబయి : ఓ విమానం ఢీకొనడంతో 30కి పైగా ఫ్లెమింగో పక్షులు చనిపోయాయి. ముంబయి విమానశ్రయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఫ్లైట్ ల్యాండ్ అయ్యే సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అధికారులు తెలిపారు. దుబాయ్ నుంచి ముంబయికి వస్తున్న ఎమిరేట్స్ విమానం సోమవారం రాత్రి 9 గంటల సమయంలో ల్యాండ్ కావాల్సివుంది. ఈ క్రమంలోనే ఆ వైపుగా ఎగురుతున్న ఫ్లెమింగో పక్షుల గుంపు విమానాన్ని ఢీకొంది. కాసేపటికి ఎయిర్‌పోర్టులో విమానం ల్యాండ్ అయింది. అయితే, తీవ్రంగా గాయపడి వివిధ ప్రాంతాల్లో పడిపోయిన పక్షులను గుర్తించిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఆ రాత్రి ఆయా ప్రాంతాల్లో 29కి పైగా.. మరుసటిరోజు మరికొన్ని పక్షుల కళేబరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ జాతి పక్షులు ఈ ప్రాంతంలో కనిపించడం అరుదని అధికారులు పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపించాలని పర్యావరణ కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని ప్రజలు ఛీకొడుతున్నారు

- బిజెపికి మెజారిటీ కల్ల
- కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఖర్గే

న్యూఢిల్లీ : మతోన్మాద ఆర్‌ఎస్‌ఎస్‌ను, దాని రాజకీయ వేదిక అయిన బిజెపిని ప్రజలే ఛీకొడుతున్నారని, వాటికి వ్యతిరేకంగా ధీరోదాత్తంగా పోరాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అన్నారు. ప్రముఖ వార్తా సంస్థ పిటిఐకి మంగళవారం నాడు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయన స్పందించారు. ఆ వివరాలు..

ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని కాపాడేందుకు ప్రజలు పోరాడుతున్నారని, అందుకే వారు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలుస్తున్నారని ఖర్గే అన్నారు. రామాలయం, హిందూ-ముస్లిం విభజన, భారత్-పాకిస్థాన్ మధ్య ఘర్షణల పేరుతో బిజెపి పదేపదే ప్రజలను భావోద్వేగ ప్రచారాలతో మోసం చేస్తోందని గుర్తు చేశారు. అయితే ఈ దఫా ఎన్నికల్లో ప్రజలు బిజెపి అసలు రంగును అర్థం చేసుకున్నారని తెలిపారు. ఇండియా ఫోరానికి సానుకూల ఫలితాలు రాబోతున్నాయని చెప్పారు. ఇండియా ఫోరానికి ఈ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు వస్తాయన్నారు. బిజెపి ఈసారి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదని, ప్రతిపక్షాల ఐక్య వేదికగా తమ ఫోరానికి మద్దతుగా ప్రజలు పోరాడుతున్నారని తెలిపారు. ఈ దఫా సార్వత్రిక ఎన్నికల్లో ధరల పెరుగుదల, నిరుద్యోగం ప్రధాన అంశాలుగా మారాయని ఖర్గే ఆరోపించారు. రెండు కోట్ల ఉద్యోగాలు, విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెనక్కి



రప్పించడం, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం వంటి హామీలను బిజెపి నెరవేర్చలేకపోయిందని విమర్శించారు.

'రాజ్యాంగాన్ని మార్చాలంటే మూడింట రెండు వంతుల మెజారిటీ కావాలి. 400 సీట్లు గెలిపించాలని బిజెపి పదేపదే చెబుతోంది. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కూడా రిజర్వేషన్ గురించి మాట్లాడారు. రాజ్యాంగంలో ఉన్న వాటిని వారు తీసేయలేరు. బిజెపి రాజ్యాంగాన్ని మార్చాలనుకుంటుంది. పలు పదవుల్లో ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తులను నియమించాలనుకుంటుంది. మధ్యప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, మణిపుర్, ఉత్తరాఖండ్, గోవాలో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాలను బిజెపి ఇబ్బందుల పాల్జేసింది. బిజెపి ప్రజాస్వామ్యాన్ని కూడా అంగీకరించదు. రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తోంది. అందుకే ఈ ఎన్నికలు ప్రజలకు చాలా ముఖ్యమైనవి' అని ఖర్గే తెలిపారు. హిందూ-ముస్లిం మధ్య విద్వేషాలు వ్యాప్తి చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రజా జీవితం నుంచి తప్పుకోవాలని ఖర్గే డిమాండ్ చేశారు.

ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతీ రోజూ విద్వేష ప్రసంగాలు చేస్తున్న మోడీ ఉద్దేశ్యాలు సక్రమంగా లేవని ఆయన విమర్శించారు. హిందూ-ముస్లిం అంటూ ప్రజలను విడదీసి మాట్లాడితే ప్రజా జీవితంలో ఉండే హక్కు లేదని ప్రధానమంత్రి మోడీనే గతంలో పేర్కొన్న ఇంటర్వ్యూను ఈ సందర్భంగా ఖర్గే గుర్తు చేశారు. అలా అయితే నిజానికి మోడీనే ప్రజాజీవితం నుంచి తప్పుకోవాలన్నారు. కనీసం, తాను చెప్పినదానికైనా మోడీ కట్టుబడి ఉండాలని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీలను బుజ్జగించే రాజకీయాలకు పాల్పడుతోందంటూ మోడీ చేసిన ఆరోపణలను కూడా ఖర్గే తోసిపుచ్చారు. పేద ప్రజలకు సహాయం చేయడం బుజ్జగింపు కాదని ఆయన అన్నారు.

తమిళ ప్రజలను అవమానించడమే

- రత్న భాండాగారం తాళాలపై మోడీ వ్యాఖ్యల పట్ల స్టాలిన్ ఆగ్రహం



చెన్నై: ఒడిశాలోని పూరీ జగన్నాథుడి ఆలయంలో ఉన్న రత్న భాండాగారం తాళం చెవులు కనిపించడం లేదంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యల పట్ల తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తాళాలు ఒడిశా నుంచి తమిళనాడుకు చేరుకున్నాయని మోడీ ఆరోపించడం తమిళ ప్రజలను అవమానించడమేనని స్టాలిన్ తప్పుబట్టారు. 'ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిశా వంటి రాష్ట్రాల్లో పర్యటించిన మోడీ.. ఓట్ల కోసం తమిళనాడు ప్రజలను పొగిడారు. కానీ, రత్న భాండాగారం తాళం చెవులు తమిళనాడుకు చేరుకున్నాయని తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన వ్యాఖ్యలు అటు పూరిజగన్నాథుడిని, ఇటు తమిళ ప్రజలను కించపరిచేలా ఉన్నాయి. ఆయన ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారు. కేవలం ఓట్లు పొందేందుకే ప్రధాని ఇలాంటి కుయుక్తులకు పాల్పడుతున్నారు. ఆయన వైఖరిని ప్రజలు అర్థం చేసుకుంటున్నారు' అని స్టాలిన్ పేర్కొన్నారు. ఆలయంలోని నిధిని తస్కరించారని తమిళ ప్రజలను ఉద్దేశిస్తూ ప్రధాని ఎలా మాట్లాడతారని ఆయన నిలదీశారు. మోడీ ఇలాంటి వ్యాఖ్యలతో మొత్తం తమిళనాడును అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ నాయకుడంటే రాష్ట్ర ప్రజల మధ్య సోదరభావాన్ని పెంపొందించేందుకు ప్రయత్నించాలే కానీ, ఇలాంటి విద్వేషపూరిత ప్రసంగాలతో శతృత్వాన్ని సృష్టించేలా కాదని హితవు పలికారు. అసలు ఆయనకు తమిళులపై ఇంత ద్వేషం ఎందుకు? ఇకనైనా ఓట్ల కోసం రాష్ట్ర ప్రజలను కించపరచడం మానుకోవాలని స్టాలిన్ హితవు పలికారు.

వారణాసి మినహా అన్నింటా బిజెపికి ఓటమే

- లాల్‌గంజ్ సభలో అఖిలేశ్ యాదవ్




లక్నో : ఉత్తరప్రదేశ్‌లో ప్రతిపక్షాల ఐక్య వేదిక 'ఇండియా' ఫోరం పవనాలు వీస్తున్నాయని సమాజ్‌వాదీ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బరిలో నిలిచిన వారణాసి లోక్‌సభ స్థానం మినహా యుపిలోని అన్ని స్థానాల్లోనూ బిజెపి పరాభవం పాలౌతుందన్నారు. 'ఇండియా' ఫోరం అభ్యర్థులకు మద్దతుగా లాల్‌గంజ్‌లో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. ఈసారి ఎలాంటి వ్యూహాలతో వచ్చినా యుపి ప్రజలు బిజెపిని తుడిచిపెట్టాలని నిర్ణయించుకున్నారని అఖిలేశ్ అన్నారు. వారణాసి నియోజకవర్గాన్ని క్యోటో నగరంగా పేర్కొన్న ఆయన.. బిజెపి ఒకే ఒక్క సీటులో మాత్రమే గెలుస్తుందని.. అది కూడా క్యోటోలోనే అని అన్నారు. మిగతా అన్ని సీట్లలోనూ ఓటమి తప్పదని వ్యాఖ్యానించారు. వారణాసిని జపాన్‌లోని క్యోటో నగరంగా అభివద్ధి చేస్తానంటూ ప్రధాని నరేంద్ర మోడీ గతంలో హామీ ఇచ్చిన నేపథ్యంలో సెటైరికల్‌గా ఆ పేరును అఖిలేశ్ ప్రస్తావించడం విశేషం. ఎన్నికలు మొదలైనప్పుడు బిజెపి 400 సీట్లు దాటుతాయంటూ నినదించిందని.. ఇప్పుడేమో ప్రజలు 400 సీట్లలో ఓడిస్తామంటున్నారని ఆయన అన్నారు. ఈసారి 140 కోట్ల మంది ప్రజలు బిజెపికి 140 సీట్లు కూడా ఇవ్వరని చెప్పారు. బిజెపి ఇచ్చిన ప్రతి హామీ బూటకమేనంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అఖిలేశ్ సభావేదిక వద్ద స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. పెద్దసంఖ్యలో జనం దూసుకురావడంతో వారిని నియంత్రించేందుకు పోలీసులు లాఠీఛార్జి చేయాల్సివచ్చింది. 'ఇండియా' ఫోరానికి విశేష ఆదరణ లభిస్తోందనడానికి ఫోరం సభలకు పోటెత్తుతున్న అశేష జనవాహిని నిదర్శనమని విశ్లేషకులు చెబుతున్నారు.

రైసికి కన్నీటి వీడ్కోలు



తబ్రీజ్ : ప్రియతమ నేతను కడసారి వీక్షించేందుకు లక్షలాది మంది ఇరానీయన్లు తబ్రీజ్‌కు పోటెత్తారు. ఆదివారం హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన ఇరాన్ అధ్యక్షులు ఇబ్రహీం రైసీ అంతిమ యాత్ర మంగళ వారం ప్రారంభమయింది. తూర్పు అజర్‌బైజాన్ ప్రావిన్స్ రాజధాని తబ్రీజ్‌లో ప్రారంభమైన ఈ యాత్రలో తమ అభిమాన నేత కడసారి చూపు కోసం లక్షలాది మంది ప్రజలు తరలివచ్చారు. అధ్యక్షుడి చిత్రాలను, ఇరాన్ జాతీయ జెండాలను ప్రదర్శస్తూ కన్నీటిపర్యంతమయ్యారు. తబ్రీజ్ సెంట్రల్ స్క్వేర్ నుంచి యాత్ర సాగింది. ఇరాన్‌లో ఇతర నగరాల్లో కూడా రైసీ అంతిమ యాత్ర జరగనుంది. తబ్రీజ్ తరువాత ఇరాన్‌లో మతపరంగా ముఖ్య పట్టణమైన కోమ్‌లో రైసీ అంతిమ యాత్ర సాగింది. బుధవారం దేశ రాజధాని టెహ్రాన్‌లో భారీ ఎత్తున అంతిమ యాత్ర నిర్వహించనున్నారు. ఇక్కడ జరిగే ప్రార్థనలకు సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ నేతృత్వం వహించనున్నారు. దేశ, విదేశాలకు చెందిన ప్రముఖులు కూడా పాల్గొననున్నారు. రైసీ అంత్యక్రియలను అతను పుట్టి పెరిగిన, ఇరాన్‌లో రెండో అతి పెద్ద పట్టణం మసాద్‌లో గురువారం నిర్వహించనున్నారు.

మాలీవాల్‌పై దాడి కేసులో విచారణ వేగవంతం



న్యూఢిల్లీ : ఆమాద్మీ పార్టీ రాజ్యసభ ఎంపీ స్వాతి మాలీవాల్‌పై దాడి కేసులో ఢిల్లీ పోలీసులు విచారణను వేగవంతం చేశారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్ట్ అయిన ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ సన్నిహితుడు బిభవ్ కుమార్‌ను మంగళవారం నాడు పోలీసులు విచారణ కోసం ముంబయి తీసుకెళ్లారు. సాక్ష్యాలను బిభవ్ ధ్వంసం చేశారని స్వాతి మాలీవాల్ ఆరోపించిన వేళ, అది నిజమో కాదో తేల్చుకునేందుకు ఢిల్లీ పోలీసుల ప్రత్యేక బందం ఆయనను ముంబయి తీసుకుని వెళ్లింది. ఇందుకోసం తీస్ హజారీ కోర్టు నుంచి పోలీసులు అనుమతి తీసుకున్నారు. తనపై దాడి తర్వాత బిభవ్ తన ఫోన్‌ను పూర్తిగా ఫార్మాట్ చేశారని స్వాతి మాలీవాల్ ఇటీవల ఆరోపించారు. దీంతో పోలీసులు బిభవ్‌ను ముంబయి తీసుకెళ్లి సీన్ రీక్రియేషన్ చేయనున్నారు. బిభవ్ కుమార్ తన ఫోన్‌లోని కీలకమైన సాక్ష్యాలను ధ్వంసం చేశారో లేదో, ఫోన్ ఫార్మాట్ జరిగిందా లేదా అనేది తేల్చేందుకు సీన్ రీక్రియేషన్ చాలా ముఖ్యమైనని పోలీసులు తెలిపారు.

కనుమరుగవుతున్న పచ్చిక బీళ్లు


- సగానికి సగం ధ్వంసం
- ఆహార భద్రతకు పెనుముప్పు
- పశు పోషకుల ఉపాధిపైనా ప్రభావం
- ఐక్యరాజ్యసమితి ఆందోళన



బెర్లిన్ : ప్రపంచవ్యాప్తంగా ఉన్న పచ్చిక బయళ్లు నెమ్మదిగా కనుమరుగవుతున్నాయని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. ఇదివరకు ఉన్న గడ్డిభూముల్లో ఇప్పటికే 50 శాతం వరకూ ధ్వంసమైపోయాయని తెలిపింది. ఈ పరిణామం వందల కోట్ల మంది శ్రేయస్సును, ఆహారభద్రతను ప్రమాదంలోకి నెట్టివేస్తుందని తెలిపింది. ఎడారి ప్రాంతాల నివారణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ 'కన్వెన్షన్ టు కంబాట్ డిసార్టిఫికేషన్ (యుఎన్‌సిసిడి)' మంగళవారం ఒక నివేదికను విడుదల చేసింది. గడ్డిభూములు, పశుపోషణ మైదానాలు భూభాగంలో 54 శాతం వరకూ వ్యాపించి ఉన్నాయి. ప్రపంచ ఆహార ఉత్పత్తిలో ఆరో వంతు వాటాను కలిగిఉన్నాయి. అయితే ఈ భూములన్నీ నేల కోత, లవణీయత, జీవవైవిధ్యం కోల్పోవడం, మితిమీరిన వినియోగం, దుర్వినియోగం, వాతావరణ మార్పులు వంటి కారణాలతో వినాశనానికి గురవుతున్నాయని ఐరాస తన నివేదికలో తెలిపింది. అలాగే, ఈ భూములను పంట భూములుగా మార్చడం, పట్టణ ప్రాంతాలుగా మారడం వంటివి కూడా సమస్యను మరింతగా పెంచుతున్నాయని హెచ్చరించింది. గడ్డిభూములను సంరక్షించడానికి వాతావరణ వ్యూహాలను మెరుగుపర్చడం, భూ మార్పిడులను తగ్గించడం వంటివి చేపట్టాలని నివేదిక సిఫార్సు చేసింది. గడిమైదానాలు వినాశనానికి గురికావడం పట్ల మానవుల స్పందన అంతంత మాత్రంగానే ఉంటోందని ఐరాస సిసిడి ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ ఇబ్రహీం థియాన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక అడవిని నరికివేసినప్పుడు లేదా 100 ఏళ్ల చెట్టు పడిపోవడం చూసినప్పుడో చాలా మందిలో కలిగే భావోద్వేగ ప్రతిస్పందన.. ఒక పురాతన గడ్డిమైదానం వినాశనానికి గురైనప్పుడు కలగడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 50 కోట్ల మంది పశుపోషకులు ఉన్నప్పటికీ ఈ సమస్య విస్మరణకు గురవుతోందన్నారు. పశుపోషకుల జీవనోపాధిని నేరుగా ప్రభావితం చేసే అంశమే అయినా దీనిపై ఎవ్వరూ గొంతెత్తడం లేదన్నారు. పశువుల మేత డిమాండ్‌కు తగ్గట్లుగా గడ్డిభూములు లేకపోతే ఆక్రమణలు, కరువు, కార్చిచ్చులు వంటి ప్రమాదాలు పెరుగుతాయని చెప్పారు. ఎడారీకరణ, భూమి సారం తగ్గం వంటి అంశాలను వేగవంతం చేస్తాయని చెప్పారు. భవిష్యత్ తరాల ఆర్థిక స్థిరత్వం కోసం గడ్డిభూముల విలువపై అవగాహనను మెరుగుపర్చాలని, వాటి రక్షించాల్సిన అవసరం ఉందని గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ ఫెసిలిటీ సిఇఒ, చైర్‌పర్సన్ కార్లోస్ మాన్యుయెల్ రోడ్రిగ్జ్ చెప్పారు.



చమత్కారం



'దేశభాషలందు తెలుగు లెస్స' అని సగర్వంగా ఎలుగెత్తి చాటిన శ్రీ కృష్ణదేవరాయలు ఒకసారి మహామంత్రి తిమ్మరుసుతో కలిసి అష్ట దిగ్గజాలతో కొలువై ఉన్నారు. ఆ రోజు రాజు గారు కవులతో ముచ్చటిస్తూ అనేక సాహిత్య అంశాలు తెలుసుకోవాలని ఆశపడ్డారు. ఆస్థాన కవుల్లో ఒకరైన తెనాలి రామలింగడిని ఉద్దేశించి, 'రామలింగా! మంత్రి తిమ్మరుసు గురించి నీ అభిప్రాయం ఏమిటో తెలుగు భాషా చమత్కారంతో చెప్పాలి' అనడిగారు.

వెంటనే రామలింగడు ఏ మాత్రం తడుముకోకుండా 'మన సువిశాల విజయనగర సామ్రాజ్యాన్ని తమరు చక్కగా చక్రం తిప్పగలుగుతున్నారంటే ఆ చక్రానికి ఇరుసు తిమ్మరుసు' అని ప్రాస కుదిరేలా చమత్కారంగా, సమయస్ఫూర్తితో చెప్పారు. ఆ సమాధానానికి శ్రీకృష్ణదేవరాయలతో సహా సభలో అందరూ చప్పట్లతో అభినందించారు.

'శెభాష్! రామలింగా, ఇదే రీతిలో నీ గురించి మేము అనాలి, అంటే ఏమనాలి?' అన్నారు. "దానికేముంది మహా ప్రభూ! 'తెనాలి వంటి విదూషకుడు ఈలోకాన ఇంకొకడు లేడనాలి" అని మరోసారి ప్రాస కుదిరేలా చెప్పేసరికి మరోసారి చప్పట్లతో సభ దద్దరిల్లింది. "చివరగా నా గురించి ఏమని చెపుతావు రామలింగా!" అని రాయలు నవ్వుతూ అడిగారు.

'ఆంధ్రభోజుడు శ్రీకష్ణదేవరాయలు వర్ణింప శక్యమా ఆయన హొయలు' అని రామలింగడు చెప్పేసరికి మరోసారి కరతాళ ధ్వనులతో సభాప్రాంగణం మార్మోగిపోయింది. శ్రీకృష్ణ దేవరాయలు రామలింగడిని ఆప్యాయంగా కౌగిలించుకొని, తగు విధంగా సత్కరించారు.

- కొమ్ముల వెంకట సూర్యనారాయణ,
రాజమహేంద్రవరం,
99496 02721.

మొక్కలు నాటుదాం



మండుటెండల్లో
ఇంట్లో వుందాం.
మామిడి పండ్లు
హ్యాపీగా తిందాం.
సాయంత్రం
గల్లీ క్రికెట్ ఆడుదాం.
ఐపీఎల్ మ్యాచ్‌లు చూద్దాం.
వివేకానంద, గాంధీజీ, కలాం వంటి
మహానుభావుల జీవిత చరిత్ర
పుస్తకాలను చదువుదాం.

మొబైల్ ఫోన్‌లో కాసేపు
వీడియోలు చూద్దాం.
మనకు నచ్చిన రంగులతో
బొమ్మలు గీద్దాం.
అమ్మమ్మ, నాన్నమ్మలతో
అల్లరిగా ఆటలు ఆడుదాం.
తాతయ్యలు చెప్పే నీతికథలు
స్ఫూర్తి గాథలు ఆసక్తిగా విందాం.

వీలైతే చిన్న చిన్న మొక్కలు
నాటుదాం.
నాటిన మొక్కలకు
నీళ్ళు పోసి పెంచుదాం.
పక్షుల కోసం బయట
నీళ్ళు పెడదాం.
విహార విజ్ఞానం
మిత్రులకు చెబుదాం
గొడవలు కొట్లాటలు
మరచిపోదాం.
వేసవి సెలవుల్లో
ఎంజాయ్ చేద్దాం!

- ఫిజిక్స్ అరుణ్ కుమార్,
నాగర్ కర్నూలు,
93947 49536.

బొమ్మరిల్లు





ఆర్.హర్షిత
5వ తరగతి,
సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్,
మచిలీపట్నం.



ఫర్హానా,
8వ తరగతి

గమనిక

వేసవి సెలవుల్లో పిల్లలకు తోడుగా ప్రతిరోజూ 'వేసవి విడిది' ముస్తాబై వస్తోంది. విద్యార్థినీ విద్యార్థుల రచనలను ఆహ్వానిస్తోంది. కథలు, కవితలు, బొమ్మలు, సెలవుల్లో మీ అనుభవాలు, ప్రయాణ విశేషాలు, ఇతరత్రా కబుర్లూ మెయిల్ లేదా వాట్సాప్ నెం : 8332925496కి పంపండి.
మెయిల్ ఐడి: chinnaarips@gmail.com
- ఎడిటర్

JEEVANA జీవన the family

జీవన సౌరభం

నిద్రలో కనే కలలు ఎప్పుడూ నిజం కావు. ఏ కల కోసమైతే నిద్రను వదులుకుంటారో అదే నిజమవుతుంది.

పిల్లల్లో మలబద్ధకం .. వదిలిద్దాం ఇలా ...



మలబద్ధకం సమస్య పెద్దవాళ్లనే కాదు; పిల్లల్ని కూడా ఇబ్బంది పెడుతుంది. పిల్లల్లో ఈ సమస్య ఉన్నప్పుడు కడుపు నొప్పి, ఆకలి లేకపోవడం, ఉబ్బరం వంటి వాటితో బాధపడుతుంటారు. వారానికి మూడు లేదా అంతకంటే తక్కువ సార్లు విసర్జన చేస్తున్నట్లైతే దాన్ని మలబద్ధకంగా భావించాలి. ఈ సమస్య నుండి పిల్లలను త్వరగా బయటపడేయాలి. లేకపోతే ఇతర ఆరోగ్యసమస్యలు వచ్చే ప్రమాదముంది.

సమస్యకు కారణం ఏంటి?

తక్కువ నీరు తాగడం, ఫైబర్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోకపోవడం, ఆహారంలో అధిక కొవ్వులు తీసుకోవడం, వ్యాయామం తగ్గించడం మొదలైన వాటి వల్ల ఈ సమస్య వస్తుంది. ఆహారంలో కొన్ని మార్పులు చేయడం ద్వారా పిల్లల్లో మలబద్ధకం సమస్యను పోగొట్టవచ్చు.

సంమృద్ధిగా నీరు తాగించాలి

చాలామంది పిల్లలు రోజంతా చాలా తక్కువ నీటిని తాగుతారు. ఇది వారి ఆరోగ్యానికి మంచిది కాదు. పిల్లలకు నీరు ఎక్కువ తాగడం అలవాటు చేయాలి. రోజూ 6 నుంచి 7 గ్లాసుల నీరు తాగడం అవసరం. మలబద్ధకం ఉంటే నీరు తాగించే పరిమాణం పెంచవచ్చు. ఈ కారణంగా, శరీరం నుండి టాక్సిన్స్ సులభంగా తొలగించబడతాయి.

పీచు పదార్థాలు : మలవిసర్జన సజావుగా జరగాలంటే పీచు పదార్థాలు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. తృణధాన్యాలు, పచ్చి కూరగాయలు, పీచుతో కూడిన పండ్లు, బీన్స్, పప్పులు తప్పనిసరిగా తినిపించాలి.

అవిసె గింజలు : అవిసె గింజలు మలబద్ధకం నుండి ఉపశమనం పొందడంలో బాగా సహాయపడతాయి. వీటిలో అధికమోతాదులో ఫైబర్ ఉంటుంది. ఈ గింజలను పొడి చేసి రసం, స్మూతీ, సలాడ్, పెరుగు, సూప్ మొదలైన వాటితో కలిపి తీసుకోవచ్చు.

గోరువెచ్చని పాలు, అరటిపండు : పిల్లలు అరటిపండ్లను తినడానికి ఎక్కువగా ఇష్టపడతారు. మలబద్ధకంతో బాధపడే పిల్లలకు గోరువెచ్చని పాలతో కలిపి అరటిపండ్లను తినిపించాలి. ఇలా చేస్తే శరీరం నుండి మలం సులభంగా బయటకు వెళుతుంది.

అవుట్‌డోర్ గేమ్స్ : పిల్లలు వీడియో గేమ్‌లు ఆడుతూ, టీవీలకు, ఫోన్లకు అతుక్కుపోతున్నారు. అలా చేయకుండా వారిని ఫిజికల్ గేమ్స్ వైపు ప్రోత్సహించాలి. ఫలితంగా మలబద్ధకం సమస్య దూరమయ్యే అవకాశం ఉంది. అయితే పిల్లలు తరచూ కడుపు నొప్పి అంటుంటే మాత్రం అది నులిపురుగుల సమస్య అయ్యే అవకాశం ఉంటుంది. ఇలాంటి సందర్భంలో డాక్టర్ సలహా మేరకు చికిత్స ప్రారంభించాలి.

గొంతు గర గర పోవాలంటే ...

ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయి. ఈ సమయంలో బ్యాక్టీరియా మన శరీరంపై దాడికి సిద్ధమవుతుంది. ముఖ్యంగా గొంతు సమస్యలు తెగ ఇబ్బంది పెడతాయి. గొంతులో గరగరగా ఉందంటే మన శరీరంలోకి ఏవో బ్యాక్టీరియా ప్రవేశిస్తోందని, వాటిపై మన రోగ నిరోధక శక్తి పోరాడుతోందని అర్థం. జలుబు, జ్వరం, అలెర్జీలు, కాలుష్యం, పొగ వంటివి గొంతు గరగరకు దారితీస్తాయి. దీన్ని సులభంగా దూరం చేసుకోవాలంటే కొన్ని చిట్కాలు పాటించాలి.

- గోరు వెచ్చని పాలలో అర టీ స్పూన్ పసుపు వేసి తాగాలి. ఇలా చేస్తే గొంతులో గరగర మాయమవుతుంది.
- అల్లాన్ని పేస్ట్ చేసి, దాల్చిన చెక్కను పొడి చేసి, వాటితో టీ పొడి కలిపి టీ పెట్టుకొని తాగాలి. ఇలా రోజుకు మూడుసార్లు చేస్తే ఫలితం కనిపిస్తుంది.
- అల్లాన్ని మెత్తగా నూరి, టీలో కలిపి ఐదు నిమిషాలు మరిగించి తాగినా మంచి ఫలితం ఉంటుంది.
- పుదీనా ఆకుల్ని నీటిలో వేసి ఐదు నిమిషాలు మరిగించి, ఆకులు తీసివేసి, ఆ నీళ్ల తాగాలి.



నిమ్మ తొక్కలతో ప్రయోజనాలు



సాధారణంగా నిమ్మకాయలను రసం పిండేసి తొక్కలను పారేస్తాం. అయితే నిమ్మ తొక్కల్లో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.

- నిమ్మ తొక్కల్లో విటమిన్ సి ఉంటుంది.
- నిమ్మ తొక్కలలో ఉండే బయోఫ్లావనాయిడ్స్ ఎముకల ఆరోగ్యానికి, ఒత్తిడిని ఎదుర్కోవడానికి ఉపయోగపడతాయి.
- నిమ్మ తొక్కలు యాంటీ బాక్టీరియల్ భాగాలను కలిగి ఉంటాయి. ముఖ్యంగా నోటి ఆరోగ్యానికి మేలు చేస్తాయి.
- ఇందులో ఉన్న ఫైబర్ కంటెంట్ ఆహారాన్ని సులభంగా జీర్ణం చేయడానికి సహాయపడుతుంది, గట్ ఆరోగ్యాన్ని కాపాడుతుంది..
- బరువును తగ్గించడంలో చాలా బాగా పనిచేస్తుంది..
- గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.
- నిమ్మకాయ తొక్కలను ఎండబెట్టి వాటిని ఆహారంలో భాగం చేసుకోవచ్చు. ఉదాహరణకు ఎండిన నిమ్మ తొక్కలతో టీ తాగడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి..
- నాన్‌వెజ్ వంటల్లో నిమ్మరసం వాడుతుంటాం. దానికి బదులుగా నిమ్మ తొక్కల పొడిని ఉపయోగించవచ్చు. నిమ్మ తొక్కలు నానబెట్టిన నీళ్లతో స్నానం చేయడం వల్ల చర్మంపై వచ్చే ఇన్‌ఫెక్షన్లు తగ్గుముఖం పడతాయి.

వికాస్ వీడి.. విద్వేషం గక్కుతూ..

- మోడీ ఎన్నికల ప్రచార ధోరణి
- మత సమీకరణలతో నెట్టుకొచ్చే యత్నం



న్యూఢిల్లీ : మార్చి 16న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుండి 20 రోజుల పాటు ప్రధాని నరేంద్ర మోడీ తన ప్రచారంలో ఎక్కువగా వికాస్, విశ్వగురు, వికసిత్ భారత్ వంటి పదాలను ఉపయోగించారు. కాంగ్రెస్ కుటుంబ పాలనపై విమర్శలు చేశారు. అయితే ప్రతిపక్షాల ఐక్య వేదిక 'ఇండియా' ఫోరం క్రమేపి పుంజుకోవడంతో మోడీ ప్రచార ఎత్తుగడులు అమాంతంగా మార్చుకుంటూ వస్తున్నారు. వికాస్ నినాదాలు మానేసి..మైనార్టీలు, ప్రధానంగా ముస్లింలపైనా, అణగారిన వర్గాలకు అందే రిజర్వేషన్లపైనా అక్కసు వెళ్లగక్కుతూ వస్తున్నారు. అవి కూడా వికటించడంతో మళ్లీ తాము మైనార్టీలకు వ్యతిరేకం కాదని, రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదని నమ్మించేందుకు విఫలయత్నం చేస్తూ వచ్చారు. గత నెల 5న కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేసినప్పటి నుండి ఆయన ప్రచార సరళి మరింతగా మారిపోయింది. హిందూ-ముస్లింలకు సంబంధించిన అంశాలు, సంపద పునఃపంపిణీ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల ప్రయోజనాలకు విఘాతం కలిగేలా మత ప్రాతిపదికన రిజర్వేషన్లు వంటి విషయాల పైనే మోడీ దృష్టి కేంద్రీకరించారు. తద్వారా హిందూ ఓట్లను గంపగుత్తగా కొల్లగొట్టేందుకు ప్రయత్నించారు.

మార్చి 10-ఏప్రిల్ 5 మధ్య...

మార్చి10-ఏప్రిల్ 5 తేదీల మధ్య మోడీ పది ప్రసంగాలు చేశారు. కాంగ్రెస్, అవినీతి, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి వంటి అంశాలను అన్ని చోట్లా లేవనెత్తారు. పేదలు, మహిళలను గురించి తొమ్మిది సభల్లో మాట్లాడారు. ఎనిమిది చోట్ల విశ్వగురు, ఏడు చోట్ల మోడీ కీ గ్యారంటీలు, ఆరు చోట్ల రామమందిరంపై ప్రసంగించారు.

ఏప్రిల్ 6-20 మధ్య...

ఏప్రిల్ 6-20 తేదీల మధ్య ప్రధాని మోడీ 34 సభల్లో మాట్లాడారు. కాంగ్రెస్‌పై యథావిధిగా 32 చోట్ల విమర్శలు చేశారు. దేశాన్ని అభివృద్ధి చేశామంటూ 32 సభల్లో చెప్పారు. ప్రభుత్వ పథకాలను 31 సభల్లో ఏకరువు పెట్టారు. మోడీ కీ గ్యారంటీలను 28 చోట్ల ఇచ్చారు. ప్రతిపక్షాల అవినీతిని 27 చోట్ల ప్రస్తావించారు.

ఏప్రిల్ 21-మే 15 మధ్య...

ఏప్రిల్ 21-మే 15 తేదీల మధ్య మోడీ అత్యధికంగా 67 సభల్లో ప్రసంగించారు. 63 సభల్లో కాంగ్రెస్‌పై నిందారోపణలు చేశారు. హిందూ-ముస్లిం అంశాన్ని 60 సభల్లో లేవనెత్తి మత సమీకరణకు ప్రయత్నించారు. పథకాలు, అభివృద్ధిని 60 చోట్ల ఏకరువు పెట్టారు. ఇతర ప్రతిపక్షాలపై 57 చోట్ల ఆరోపణలు చేశారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం గురించి 54 చోట్ల ప్రసంగించారు. ప్రతిపక్షాల అవినీతిని 50 సభల్లో లేవనెత్తారు. పేదలను గురించి 49 చోట్ల మాట్లాడారు.

తొలుత పథకాలు, అభివృద్ధి పైనే ప్రచారం

మార్చి 17-ఏప్రిల్ 5 తేదీల మధ్య చేసిన 10 ప్రసంగాల్లో మోడీ ప్రధానంగా కేంద్ర పథకాలు, ప్రతిపక్షాల అవినీతిపై దృష్టి సారించారు. మార్చి 16న ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చినప్పటి నుండి ఏప్రిల్ 5న కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోను విడుదల చేసే వరకూ ప్రధాని ప్రసంగాల్లో సంక్షేమ పథకాలు, బిజెపి అభివృద్ధి ప్రధానాంశాలు అయ్యాయి. పది ప్రసంగాల్లోనూ ఈ అంశాలనే ఆయన ప్రస్తావించారు. ప్రపంచంలో భారత్ విశ్వగురుగా ఆవిర్భవించిందని ఎనిమిది సభల్లో చెప్పారు.

మధ్యలో ప్రతిపక్షాలపై విమర్శలు, ఆరోపణలు

ఏప్రిల్ 6-20 తేదీల మధ్య చేసిన ప్రసంగాల్లో మోడీ తొలిసారిగా కాంగ్రెస్‌ది 'ముస్లింలీగ్ మ్యానిఫెస్టో' అని ఆరోపించారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టో ఏప్రిల్ 5న విడుదల కాగా ఆ మరునాడే రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో జరిగిన ర్యాలీని ఉద్దేశించి ప్రధాని ప్రసంగిస్తూ కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ముస్లింలీగ్ ముద్ర కన్పిస్తోందని విమర్శించారు. ఆ పక్షం రోజుల్లో మోడీ 34 ప్రసంగాలు చేయగా ఏడు చోట్ల ఇదే అంశాన్ని లేవనెత్తారు. ప్రతిపక్షాలు హిందూ వ్యతిరేక పార్టీలు అంటూ 17 సభల్లో మండిపడ్డారు. అయోధ్యలో జరిగిన బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమానికి ప్రతిపక్షాలు గైర్హాజరు అయ్యాయని గుర్తు చేశారు. మొత్తంగా 'వికాస్' నినాదాలతో మొదలైన మోడీ ప్రచార సరళి ఎన్నికల సమరం చివరి దశకు వచ్చేసరికి మత విద్వేష జాఢ్యంతో ముగియడం ఆందోళనకరం.

'ఉబర్ బస్సు'లకు ఢిల్లీలో అనుమతి

- ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ ఆక్షేపణ
- విరమించుకోవాలని కేజ్రీవాల్‌కు లేఖ

న్యూఢిల్లీ : ఢిల్లీలో బస్సులు నడపడానికి ప్రముఖ కార్పొరేట్ సంస్థ ఉబర్‌కు అనుమతి ఇచ్చినట్లుగా వస్తున్న వార్తలపై అఖిల భారత రోడ్డు రవాణా కార్మికుల సమాఖ్య (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఒక లేఖ రాసింది. ఢిల్లీలో బస్సులు నడపడానికి ఉబర్‌కు అనుమతి ఇవ్వడం ఢిల్లీ ప్రజలు, డ్రైవర్లు, ఢిల్లీ రవాణా కార్పొరేషన్ (డిటిసి) ప్రయోజనాలకు హానికరమని పేర్కొంది. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో ఉబర్‌కు అనుమతి ఇవ్వడం ఎన్నికల ప్రవర్తనా నియామళిని ఉల్లంఘించడమేనని తెలిపింది. అలాగే మోటార్ వాహనాల సవరణల చట్టం 2019ను తాము మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నట్లు ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ పునరుద్ఘాటించింది. ఈ చట్టానికి వ్యతిరేకంగా సమ్మె చేశామని గుర్తు చేసింది. దేశవ్యాప్తంగా తీవ్ర ప్రతిఘటన వెల్లువెత్తినా కేంద్రంలోని మోడీ సర్కార్ 2019 జులైలో ఈ చట్టాన్ని తీసుకొచ్చిందని ఆందోళన వ్యక్తం చేసింది. ఒకవైపు కేంద్ర ప్రభుత్వ వినాశకర చర్యలపై పోరాడుతూ మరోవైపు అదే ప్రభుత్వం తీసుకొచ్చిన వినాశకర చట్టాన్ని సాకుగా చేసుకొని ఉబర్‌కు ఇలాంటి అనుమతులు ఇవ్వడం సమంజసం కాదని ఆక్షేపించింది. కేంద్రం తీసుకొచ్చిన మోటారు వాహనాల సవరణ చట్టంలోని క్లాజ్ 36 ఆఫ్ సెక్షన్ 93 ప్రకారం ప్రయివేటు అగ్రిగేటర్లకు ఇలాంటి లైసెన్స్‌లు ఇచ్చేలా వెసులుబాటు కల్పించిన సంగతి విదితమే. మొత్తం రోడ్డు రవాణా రంగాన్ని భారీ కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే లక్ష్యంతోనే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ క్లాజ్ చేర్చారని ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ విమర్శించింది.

ఉబర్, ఓలా వంటి అగ్రిగేటర్లు అటు డ్రైవర్లను ఇటు ప్రయాణికులను ఎలా మోసం చేస్తున్నాయో చూస్తున్నామని, ఆ సంస్థల వేధింపులకు వ్యతిరేకంగా డ్రైవర్లు సమ్మె చేపట్టిన సందర్భాలు కూడా ఉన్నాయని పేర్కొంది. ఈ అంశాలన్నీ దృష్టిలో ఉంచుకొని తక్షణమే ఉబర్‌కు ఇచ్చిన అనుమతులను వెనక్కి తీసుకోవాలని కోరింది.

ఫైనల్‌కు కోల్‌కతా

- సన్‌రైజర్స్‌పై ఎనిమిది వికెట్ల తేడాతో నైట్‌రైడర్స్ ఘన విజయం
- నిప్పులు చెరిగిన స్టార్క్



స్టార్క్(3/34)

అహ్మదాబాద్: రెండుసార్లు టైటిల్ విజేత కోల్‌కతా నైట్‌రైడర్స్ మూడోసారి ఫైనల్లోకి దూసుకెళ్లింది. నరేంద్ర మోడీ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మంగళవారం జరిగిన తొలి క్వాలిఫయర్-1లో కోల్‌కతా జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్‌ను కోల్‌కతా పేసర్ స్టార్క్(3/34) దెబ్బ తీసాడు. స్టార్ ఓపెనర్లు హెడ్(0), నితీశ్ రెడ్డి(9), షాబాజ్(0)లను ఔట్‌చేశాడు. దీంతో సన్‌రైజర్స్ 39పరుగులకే 4వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ సన్‌రైజర్స్‌ను త్రిపాఠి అర్ధసెంచరీతో ఆదుకున్నాడు. దీంతో 19.3ఓవర్లలో 159పరుగులకు ఆలౌటైంది. ఆ లక్ష్యాన్ని కోల్‌కతా జట్టు 13.4 ఓవర్లలో 2వికెట్ల నష్టానికి 164పరుగులు చేసి ఘన విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ స్టార్క్‌కు లభించింది.

టాస్ గెలిచిన కమిన్స్ బ్యాటింగ్ తీసుకొని భారీ మూల్యమే చెల్లించాడు. 13 పరుగులకే ఓపెనర్లు డగౌట్‌కు చేరారు. తొలి ఓవర్లోనే ట్రావిస్ హెడ్(0)ను సూపర్ యార్కర్‌తో మిచెల్ స్టార్క్ వెనక్కి పంపి సన్‌రైజర్స్‌కు షాకిచ్చాడు. రెండో ఓవర్లోనే డేంజరస్ ఓపెనర్ అభిషేక్ శర్మ(3) సైతం ఔట్ చేరడంతో హైదరాబాద్ శిబిరంలో ఆందోళన మొదలైంది. అయితే.. రాహుల్ త్రిపాఠి(55) అద్భుతంగా పోరాడాడు. హెన్రిచ్ క్లాసెన్(32) అర్ధసెంచరీ భాగస్వామ్యం నెలకొల్పాడు. దీంతో 13 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 121పరుగులతో పటిష్టంగా ఉన్న హైదరాబాద్ ఐదు పరుగుల వ్యవధిలో నాలుగు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. రాహుల్ త్రిపాఠి(55) అర్ధ సెంచరీ పూర్తిచేసి క్రీజ్‌లో నిలదొక్కుకొని ఉన్న దశలో అబ్దుల్ సమద్ అనవసర పరుగుకు త్రిపాఠిని రనౌట్ చేశాడు. ఆ రనౌట్ సన్‌రైజర్స్‌ను కోలుకోలేని దెబ్బ తీసింది. ఆ తర్వాత సన్వీర్(0), భువనేశ్వర్(0), అబ్దుల్ సమద్(16) వరుసగా ఔటవ్వడంతో 9వికెట్ల నష్టానికి 126పరుగులే చేసింది. చివరి వికెట్‌కు స్టార్క్-విజయ్‌కాంత్ 33పరుగులు జతచేయడంతో 159పరుగుల గౌరవప్రదస్కోర్ చేసింది. కెప్టెన్ స్టార్క్(30) ఆదుకోగా.. విజయ్‌కాంత్(7నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించారు. కోల్‌కతా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్(3/34) విజృంభణకి తోడు వరణ్ చక్రవర్తికి రెండు, నరైన్, వైభవ్, హర్షిత్, రస్సెల్‌లకు ఒక్కో వికెట్ దక్కాయి.

ఛేదనలో కోల్‌కతా ఓపెనర్లు గుర్బాజ్(23), నరైన్(21) తొలి వికెట్‌కు 44పరుగులు జతచేశారు. ఆ తర్వాత వీరిద్దరూ ఔటైనా.. శ్రేయస్ బ్రదర్స్ మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. వెంకటేశ్ అయ్యర్(51), శ్రేయస్ అయ్యర్(55) అర్ధసెంచరీలతో రాణించి 13.4ఓవర్లలోనూ మ్యాచ్‌ను ముగించారు. ఈ గెలుపుతో కోల్‌కతా ఫైనల్‌కు చేరగా.. నేడు జరిగే ఎలిమినేటర్ విజేతతో సన్‌రైజర్స్ జట్టు 24న(శుక్రవారం) తలపడనుంది.

స్కోర్‌బోర్డు..

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: హెడ్ (బి)స్టార్క్ 0, అభిషేక్ శర్మ (సి)రస్సెల్ (బి)వైభవ్ అరోరా 3, త్రిపాఠి (రనౌట్)రస్సెల్/గుర్బాజ్ 55, నితీశ్ రెడ్డి (సి)గుర్బాజ్ (బి)స్టార్క్ 9, షాబాజ్ అహ్మద్ (బి)స్టార్క్ 0, క్లాసెన్ (సి)రింకు సింగ్ (బి)చక్రవర్తి 32, అబ్దుల్ సమద్ (సి)శ్రేయస్ (బి)హర్షిత్ రాణా 16, సన్వీ సింగ్ (బి)నరైన్ 0, పాట్ కమిన్స్ (సి)గుర్బాజ్ (బి)రస్సెల్ 30, భువనేశ్వర్ కుమార్ (ఎల్‌బి)చక్రవర్తి 0, విజయ్‌కాంత్ (నాటౌట్) 7, అదనం 7. (19.3ఓవర్లలో ఆలౌట్) 159పరుగులు. **వికెట్ల పతనం:** 1/0, 2/13, 3/39, 4/39, 5/101, 6/121, 7/121, 8/125, 9/126, 10/159 **బౌలింగ్:** స్టార్క్ 4-0-34-3, వైభవ్ అరోరా 2-0-17-1, హర్షిత్ రాణా 4-0-27-1, సునీల్ నరైన్ 4-0-40-1, ఆండీ రస్సెల్ 1.3-0-15-1, వరణ్ చక్రవర్తి 4-0-26-2.

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి)వి.వ్యాషక్ (బి)నటరాజన్ 23, నరైన్ (సి)వ్యాషక్ (బి)కమిన్స్ 21, వెంకటేశ్ అయ్యర్ (నాటౌట్) 51, శ్రేయస్ అయ్యర్ (నాటౌట్) 58, అదనం 11. (13.4 ఓవర్లలో 2వికెట్ల నష్టానికి) 164పరుగులు. **వికెట్ల పతనం:** 1/44, 2/67 **బౌలింగ్:** భువనేశ్వర్ 3-0-28-0, కమిన్స్ 3-0-38-1, నటరాజన్ 3-0-22-1, వి.వ్యాషక్ 2-0-22-0, హెడ్ 1.3-0-32-0, నితీశ్ రెడ్డి 1-0-13-0

ఐపిఎల్‌లో నేడు (ఎలిమినేటర్-1)
రాజస్తాన్ × బెంగళూరు
వేదిక: అహ్మదాబాద్; రా.7.30గం॥లకు

సాత్విక్-చిరాగ్‌లకు టాప్ ర్యాంక్

బిడబ్ల్యుఎఫ్ ర్యాంకింగ్స్ విడుదల



లాసన్నె: ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య(బిడబ్ల్యుఎఫ్) ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ డబుల్స్ జోడీ చిరాగ్ శెట్టి-సాత్విక్ సాయిరాజ్ సత్తా చాటారు. తాజా ర్యాంకింగ్స్‌లో వీరు మరోసారి అగ్రస్థానంలోకి దూసుకెళ్లారు. థాయ్‌లాండ్ బ్యాడ్మింటన్ సూపర్-500 డబుల్స్ టైటిల్‌ను చేజిక్కించుకోవడంతో వీరి ర్యాంక్ మెరుగైంది. ఈ టోర్నమెంట్‌కు ముందు వీరు 2వ స్థానంలో ఉన్నారు. శనివారం జరిగిన ఫైనల్లో సాత్విక్-చిరాగ్ జంట 21-15, 21-15తో చైనా షట్లర్లు ఓడించి టైటిల్‌ను రెండోసారి చేజిక్కించుకున్నారు. దీంతో వీరి కెరీర్‌లో 9వ బిడబ్ల్యుఎఫ్ టైటిల్ చేరింది. ఇక మహిళల డబుల్స్ జోడీ తానీషా క్రాస్టో-అశ్విని పొన్నప్ప సెమీస్‌లో ఓడినా.. వీరు రెండు స్థానాలు మెరుగుపరుచుకొని 19వ ర్యాంక్‌కు చేరారు. ఈ టోర్నీలో సంచనాల విజయాలు నమోదు చేసిన మైస్నం ఏకంగా 13స్థానాలు మెరుగుపరుకొని 71వ ర్యాంక్‌కు ఎగబాకాడు.

సుమిత్, మరియప్పలకు స్వర్ణాలు

ప్రపంచ పారా అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్



కోబే(జపాన్): ప్రపంచ పారా అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్లు సత్తా చాటారు. మంగళవారం జరిగిన పురుషుల ఎఫ్-64జావెలిన్ త్రోలో సుమిత్ అంటిల్, హైజంప్ టి-63లో మరియప్పన్ తంగవేలు రికార్డు బ్రేక్ నమోదు చేస్తూ బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. పారా జావెలిన్ త్రోలో సుమిత్ అంటిల్ 69.50మీ. జావెలిన్‌ను విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. ఇక హైజంప్ టి-63లో మరియప్పన్ తంగవేలు 1.88మీ. జంప్ చేశాడు. ఆ తర్వాత అమెరికాకు చెందిన ఎజ్రా ఫ్రెచ్ 1.85మీ. శామ్ గ్రేవ్ 1.82మీ. ఆ తర్వాతి స్థానాల్లో నిలిచి రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. మహిళల జావెలిన్ త్రో ఎఫ్-51లో ఏక్తా భయాన్ 20.12మీ. కషిశ్ లక్రా 14.56మీ. బంగారు, రజత పతకాలు సాధించారు. దీంతో పారా క్రీడల పతకాల పట్టికలో భారత్ మొత్తం 10 పతకాలతో మూడో స్థానంలో నిలిచింది. ఇందులో నాల్గు స్వర్ణ, మరో నాలుగు రజతాలతోపాటు రెండు కాంస్యాలున్నాయి. చైనా 15స్వర్ణ, 13రజతి, 13కాంస్యలతో అగ్రస్థానంలో ఉండగా.. బ్రెజిల్ 14స్వర్ణ, 6రజిత, 5కాంస్యాలతో రెండోస్థానంలో ఉన్నాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68